
ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య

ANDHRA RASTRA PRARAMBHA VIDYA

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 42]　　　　[సంచిక 3

15 జూన్ 1953



సంపాదకులు :

శ్రీయుత మహావాది వెంకటరత్నముగారు బి.ఏ.

వ్యవస్థాపకులు :

శ్రీయుత ఉదర వెంకయ్యగారు.

ప్రకాశకులు

రామా అండ్ కో

H.O ఏలూరు

V.S. GURU

విషయసూచిక

సం॥ర చందా రు 1—0—0

ఆంధ్రరాష్ట్ర
ప్రారంభవిద్య

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 42] ఏలూరు, జూన్ 15 [సంచిక 3



వివరణము :

నీ చిత్తము నిర్మలమై, హృదయము కేంద్రీకరింపబడినపుడే నీకు జ్యోతిర్దర్శనమగును. నీ దృష్టి కేంద్రమును దగుల్కొనినపుడు శరీరమంతయు కాంతిమంతమగును. ఇది ఒక్క ఆధ్యాత్మిక సత్యమేకాదు– అనుభవనీయవిషయమే. ఎవని భావము లనేక విషయములమీద ప్రాలునో వాడు బలహీనుడగును. వాని చిత్తము వికలతనొందును. భగవంతునితో సమాగమమెట్లను నదియే మానవుని యన్వేషణ. సంకుచితచిత్తమున కది లభ్యముగాదు. స్వార్థచిత్తము దాని నెఱుంగజాలదు. పవిత్రము, నిర్మలము నగు హృదయఫలకమునందే యది ప్రతిఫలించును.

సంకీర్తనము :

హే ఆత్మస్వరూపా ! నీవు నాచెంతను, నేను నీ చెంతను, ఉండునట్లను గ్రహింపుము. నిన్నొక క్షణమైనను మఱువకుండునట్లు కనికరింపుము.

స్వామి రామతీర్థ.

*** గేయము ***

భావి భరతపౌరులం - భరతమాత బిడ్డలం
బానిసత్వం రూపుమాప - బయలుదేరు ధీరులం 1
కూలి రైతు బిడ్డలం - కులము మతము లెన్నబోం
కులము మతము లేవియైన కలిసిమెలసి యుండెదం. 2
బద్ధకాన్ని బుద్ధిచెప్పి - శ్రద్ధగాను చదువుతాం
విద్దెలన్ని నేర్చుతాం - పెద్దలను మించుతాం. 3
తెలివితేట లుట్టిపడగ - మాటలాడ నేర్చుతాం
ఇరుగుపొరుగు మంచిచెడ్డ - లెఱిగి మేము నడచెదం. 4
పిఱికితనం రూపుమాపి - చుఱుకుతనం చూపుతాం
ముఱికిగుండె వారిపట్ల - కఱుకుగాను ఉండెదం. 5
వేడినెత్తురు వెల్లివిరియ - వీరకథలు చెప్పుతాం
శాత్రవాళి చీల్చివేసి - స్వేచ్ఛతోడ మసలుతాం. 6

రచన :— ఎ. యల్. నరసరాజు,
టీచరు; గడేకల్లు.

"సర్వోదయ జ్యోతి"

శ్రీమద్భారత భాగ్యనేత గురుడై శ్రీ పొట్టి శ్రీరాముచే
శ్రీమంతం బగు నాంధ్రరాష్ట్రమునకై చేయించె సత్యాగ్రహం
దీమాస్కిన్ బలియాయె ప్రాణముల లేదే నెంచు గన్నారమే
భూమిం గోరి యహింస సత్యములతో భూమీశుత్తో బోరుటల్,

తే. గీ. శాంతికాముకప్రియుడు శ్రీసత్యమూర్తి, గాంధికన్నను స్టాలినుకన్న నీవె,
ఘనుడ వని చాటినాడు ప్రకాశమతడు, పలుకడే నాడు మెరమెచ్చుపదమునొకటి.

తే. గీ. చెన్నపట్టణమందున సిద్ధిచెంది, రాష్ట్రతపసివై తమిళు లాంధ్రాళి గలసి,
కొలువ సత్కీర్తి గొన్నావు విలువగూర్చి, బాపు సిద్ధాంతములను చేపట్టి రాము!

తే. గీ. తాత చూపినబాటను తప్పకుండ, తాత చెప్పినమాటను దాటకుండ,
సత్యము నహింసలను గల సత్వమెరిగి, ఆహుతైనాడు తెనుగురాష్ట్రార్జనమున.

తే. గీ. గురుని మించినశిష్యుండు గురునిపథమె, అస్త్రశస్త్రమ్ములుగ జేసి యాంధ్రరాష్ట్ర,
మనలరింపంగ నర్పించె నసువు లౌర! పొట్టిశ్రీరాము లెంతటి గట్టివాడొ!

ఆ. వె. పట్టుపట్టి తెచ్చె పొట్టిశ్రీరాములు, గట్టి దట్టలంచు గాంచె పేరు,
అల దధీచివోలె నమరుడై యర్పించె, ప్రాణపంచకమ్ము రాష్ట్రమునకు.

తే. గీ. రాష్ట్ర ముదయింప పొట్టి శ్రీరాముభక్తి, స్థిరతగను పెట్టి గొల్వడీ దేశభక్తు,
లార! ఆంధ్రరాష్ట్రాభ్యుదయమ్ము గలుగు, దాన కల్యాణ మగుత నాంధ్రాళికెల్ల.

తే. గీ. ధారుకమిటీ రిపోర్టులో పేరుకొన్న, రాష్ట్రసిద్ధికై పణమిడె ప్రాణములను,
గాంధియానతి శిరమొగ్గి ఘనతకెక్క, శిష్యుచే నోడి బాపు ఆశిస్సులొసగె.

తే. గీ. "ఆంధ్రరాష్ట్రమ్ము సర్వోదయాంచితమయి, యలరుగావుత" మని బాపు యానతిచ్చె.
ఘనుని సర్వోదయజ్యోతి మునివృషభుని, పొట్టి శ్రీరాము దీవెన పొడమునదియు.

పామర్తి వేంకటరమణరావు,
నన్నయభట్టారక పీఠము. తణుకు.

యాజమాన్యోపాధ్యాయులకు - ఉప

సహాయ పాఠశాలలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులవద్దనుంచి కొందరు టీచరు మముగా డబ్బునుతీసుకొనుచున్నట్లు ఇటీవల పత్రికా వార్తలవల్లగాని, యితర విషయముల వెల్లడి అగుచున్నది. ఇందులో కొందరేఅయినను ఇది యావన్మంది టీచరు మేనేజరులకును, టీచర్లకును సంబంధించిన విషయముగానే భావించవలసియున్నది.

ఇందు ఉపాధ్యాయుడును యాజమాన్యోపాధ్యాయుడును గమనించవలసిన ప్రధానవిషయములను వారి స్వార్థపరత్వమున కుపయోగించుచుండుట వలననే యీ విషయమింత దూరము రాగలిగినది.

టీచర్లు టీచరు-మేనేజర్లు గమనించవలసిన ముఖ్యవిషయము ఉపాధ్యాయుడును తనవలెనే కుటుంబవంతుడై, ఆకుటుంబపోషణార్థము మాత్రమే ఉపాధ్యాయవృత్తిని చేయుచున్నాడు. అందునను తనకు చేదోడు వాదోడుగాఉండి తన పేరుతోనున్న పాఠశాలాభివృద్ధికి తోడ్పడుచున్నాడు. ఇట్టి ఉపాధ్యాయుడు దారిద్ర్యముచేతనే తన స్కూలులోచేరి పనిచేయుచున్నాడు. నీకు యిచ్చు రు 50-0-0 లు ఎట్లు కుటుంబపోషణకు చాలవో అట్లే ఉపాధ్యాయునకును చాలవు. ప్రభుత్వమువారు ఎకామిడేషన్ వగైరాలు తృప్తిగాలేవని తనకు కట్టుఇచ్చినప్పుడా టీచరు-మేనేజరు ఎట్లు అసంతృప్తిని, అవస్థను పొందునో అట్లే ఉపాధ్యాయుడును తనకురావలసిన ప్రభుత్వమువారిచే యీయబడిన గ్రాంటులో టీచరు-మేనేజరుచేత 5 నుంచి 10 రూపాయలవరకును మినహాయించి యీయబడిన గ్రాంటుతో అసంతృప్తిని, అవస్థను పొందుచున్నాడు. అసంతృప్తితోను, గృహావస్థలతోను, కూడిన యేవ్యక్తి యేపనియు చేయజాలదు. యాజమాన్యోపాధ్యాయుడు ఉపాధ్యాయులనుండి డబ్బును మినహాయించుట స్కూలు పోషణనిమిత్తమా? లేక కుటుంబ పోషణ నిమిత్తమా? కుటుంబపోషణ నిమిత్తమగుచో అంతకంటె అన్యాయము వేరొండులేదు. ఇక స్కూలుపోషణకు మాత్రమే అగుచో అది ఆయా స్థానికపరిస్థితుల కానుగుణ్యముగా మాత్రమే ఉండవలయును కాని దొంగల దోపిడిగా ఉండకూడదు,

అటులనే ఉపాధ్యాయుడును కేవలము ఖర్చులన్నియు యాజమాన్యోపాధ్యాయుడే భరించవలయుననిన తనకు రాబడు గ్రాంటును పూర్తిగా ఖర్చుచేసినను చాలక వేరే తీసుకొని రావలసియుండునని గ్రహించి కేవలము పాఠశాలా నిర్వహణకు ప్రభుత్వము వారిచ్చు మెయింటినెన్సుపోను, మిగిలిన ఖర్చును యాజమాన్యోపాధ్యాయునితోపాటు ఆస్కూలు ఉపాధ్యాయులందరును సమానముగా భరించుకొనుట మంచిదనియు మనవి చేయుచున్నాను.

కాక యేపాఠశాలలోనైనను ప్రభుత్వమువారిచ్చు గ్రాంటు మాత్రమేగాక యితరాదాయమున్నచో మాత్రము మేనేజరు ఆ ఆదాయ వ్యయములతో సమానమైన బాధ్యతను తన పాఠశాలలోని ఉపాధ్యాయులందరకు కలిగించుటగాని, అట్లు ఇష్టముగానిచో ఉపాధ్యాయుని గ్రాంటును పూర్తిగా ఉపాధ్యాయుల కిచ్చి మిగిలిన లాభనష్టములను మేనేజరే భరించుటగాని, చేయవలయుననియు కోరుచున్నాను. లాభనష్టములతో పనిలేనందున ఉపాధ్యాయుడు ఉత్సాహవంతుడగుననియు, అందువలననే మేనేజరుకూడా తృప్తిపడగలడనియును నమ్ముచున్నాను.

అట్లుగాక యేమేనేజరయినను తనకు యితరత్రా వచ్చు ఆదాయముతోపాటు ఉపాధ్యాయులనుంచి కూడ కొంత సంగ్రహించదలచుట అది మేనేజిమెంటుయొక్క గౌరవమునకే భంగము కాగలదని నమ్ముచున్నాను. మేనేజరు తాను స్వయముగా యీయజాలని దమ్మిడీ యీయలేకపోగా ప్రభుత్వమువారిచే యీయబడుచున్న దానిలో కొని మినహాయించుట యేమంతవివేకమయిన, ధర్మమయిన పని కాదని మనవి చేయుచున్నాను.

అందువలన ప్రతిస్కూలు ఉపాధ్యాయులున్నూ, యాజమాన్యోపాధ్యాయులున్నూ తమలో తామే గాని, తమలో తమకు పొత్తుకుదరదని అనుకొనుచో ఉభయుల యిష్టముమీద ఒక మధ్యవర్తిద్వారాగాని, ఆయాస్థానిక పరిస్థితులనుబట్టి యిది నిర్ణయించుకొని అల్లరికాకుండా చూచుకొనగలరని గట్టిగా నమ్ముచున్నాను.

ఇట్లు, ఉపాధ్యాయ శ్రేయోభిలాషి

తెనాలి
7—5—58

కంచిభొట్ల శివరామయ్య, టీచరు-మేనేజరు,
సాలిపేట హిందూఎలిమెంటరీ స్కూలు.

ఠాలన్నీ నేరుస్తా ::

కవిశేఖర, ఓలేటి రామనాథశాస్త్రి.

పలకను పట్టి-బలపముతోడ
అ,ఆ,ఇఈ, వ్రాస్తాను
గురువులు చెప్పిన గురుతు లవన్నీ
విసుగక చక్కా- వింటాను !
రెండో ఎక్కం నేరుస్తా
అప్పజెప్పతా అమ్మకు నే!
వాచక మొకటి కొనుక్కొంటా
తల,వల పేర్లను చదివెదను !
బడికి వేళకు వెళ్ళిపోతా
పాఠాలన్నీ నేరుస్తా !

మంచిపిల్ల

ఆటలు ఆడి-పాటలు పాడి
పంతులుగారికి నమస్కరించి !
పాఠాలన్నీ చదివెదను
పద్యాలన్నీ నేర్చెదను!
అమ్మకు-నాన్నకు నాచదువుల్
వినిపిస్తా,"మంచిపిల్ల"నని అనిపిస్తా".

దగామాటలు

కవితాభూషణ, ఓలేటి రామనాథశాస్త్రి.

ఆ|| పూర్వకాలమందు పోరు వాటిల్లెను
జంతువులకు పక్షిజాలమునకు
యుద్ధమందు మృగము లోడిపోవగ జయ
శ్రీ వరించి పక్షు లావహిల్లె... 1

* * *

ఆ|| పక్షితతిని జేరి పలికె గబ్బిల మిట్లు
ఱెక్కలున్న వివిగో!పక్కులార!
నేనుమిమ్ముబోలు దాననే, యెగుఱగ
లట్టిశక్తియున్నదట్టులగుట... ...2

* * *

గీ|| నన్ను మీలోన జేర్చుకొం డన్నలార !
అనుచు పిట్టలతో గూడి మనుచు సుఖము
సందుకొన కొంతకాలము నరుగుపిదప
పోరులో జంతువులుజయమ్మునుగడించె 3

* * *

కం|| మృగములను జేరి గబ్బిల
మగుదును మీజాతిదాన-అరయుడునోటన్
నిగనిగల పన్ను లున్నవి—
ఖగమ ట్లెగురుటను తప్పగా తలపకుడీ


* * *

కం. దేవుడు నాలుగు కాళ్లను
మీవలె నా కిచ్చినాడు మీరాదియును గు లి
ట్టీవగ రెక్కల నంటెను
కావున మీలోన జేర్చగా దగు నన్నున్. 5

* * *

గీ. జంతువులుగబ్బిలముమాటసత్యమనుచు
నమ్మి తమలోన జేర్చుకొనంగ కొంత
కాలమునకు-పక్షులకు, మృగాలకు,నొడ
గూడినది సంధి-యుద్ధసంకోచ ముడిగె.6

* * *



౧. సోదరోపాధ్యాయులకు విజ్ఞప్తి

1958 సం॥ ఏప్రిల్ 24, 25, 26 తేదీలలో కాకినాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ టీచర్సు ఫెడరేషన్ చతుర్థ మహాసభకు మన శ్రీకాకుళం జిల్లానుండి - ముఖ్యంగా సోంపేట తాలూకానుండి - నేను తప్ప వేరొకరు ప్రతినిధులుగాని, సంఘకార్యకర్తలుగాని, హాజరు కాకపోవుట చాల విచారకరము. మన జిల్లాకు ఆమహాసభలో ప్రత్యేకింపబడిన స్థలములో నేను తప్ప వేరొకరు లేకపోవుట మన జిల్లా ఉపాధ్యాయులకు తీరని అవమానము. రాష్ట్రములోగల యితరజిల్లాలనుండి షుమారు 500 మంది ప్రతినిధులును, అనేకమంది ప్రేక్షకులును, వచ్చిరి. కాన మన శ్రీకాకుళం జిల్లా ప్రాథమికోపాధ్యాయ సోదరులందరు వెంటనే సెంటరుసంఘములు, తాలూకా లేక రేంజిసంఘములు, నెలకొల్పుకొని, పాలకవర్గమును నిర్ణయించుకొని, జిల్లాసంఘమును త్వరలో పునరుద్ధరించుటకు పూనుకొనవలెనని యీలేఖద్వారా విజ్ఞప్తి చేయుచున్నాను.

ఇట్లు,
ద్వివేదుల లక్ష్మీనరసింహాం
కార్యదర్శి - సోంపేట రేంజి టీచర్సు అసోసియేషను.

౨. ట్రయినింగుస్కూలు అర్జీలు

శ్రీ ప్రభుత్వమువారు తెలియజేయువ దేమన ప్రతిసంవత్సరం ట్రయినింగుస్కూలు అర్జీల యొక్క క్రమపద్ధతిని యిప్పించుట లేదని పత్రికలమూలముననే తెలియుచున్నది. ఇంటర్వ్యూల శిష్టుప్రకారం అనేకులు ట్రయినింగుస్కూళ్ళకు వెళ్ళి డబ్బు ఖర్చుచేసుకొని వృధాగా తిరిగి వచ్చుచున్నారు.

---

౨౭ వ పేజీ తరువాయి

ఆ. కల్లపల్కు లాడు గబ్బిలమా! నీవు
మా సమూహమందు మసల కింక!
పక్షి ననుచు చెప్పి వంచించితివి మమ్ము
టంచు దిగిలువేసె నండజములు ... 7

* * *

కం. అగుదును జంతువు నే నని
దగాపలుకు లాడి మాదు దరి జేరితివా!
ఖగమువు నీవని తిట్టుచు
మృగములు గబ్బిలము బొంచి
మోదక తిగిలెన ... ...8.

గీ. పృథివి నడయాడగా దురవధిక భయము
గగనవీథిని దరియింప కడిది భీతి
గలిగి చీకటి గదులలో గబ్బిలములు
మసలుచున్నవి తమ దగామాటవలన. 9

* * *

కం. జగతిని నెవ్వారి కైనను
దగాపలుకు లాడ జనదు-ధర్మపథంబే
సుగతికి మార్గము కావున
సుగుణముతో విక్కమ్ము సత్యసూక్తుల బాలా

* * *

("ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య" ద్వారా నా రచనలను 1. పద్య నీతికథావళిలో నివి 6 కథలు 2. బాలగేయములలోనివి 5, 6 అప్పుడె ప్రచురింపబడినవి. త్వరలో పుస్తకరూపమున పాఠకులకు అందింపగలను.)

— రచయిత.

...ని ట్రెయినింగు ఆర్డర్లు యిప్పించుట అవసరము. (1) సర్వీసునుబట్టి తీయుట ...గముగా నున్న అంట్రెయిండు టీచర్లను తీయుట (3) డిప్యూటీ యిన్‌స్పెక్టరు ... చేసినవారిని తీయుట (4) పబ్లిక్ VIII స్టాండర్డు ప్యాసైనవారిని తీయుట (5) విద్యా ...ఆయుట మొ॥ యేదో 1 లేక 2 పద్ధతుల ప్రకారం ట్రెయినింగుకు తీయుటను నిర్ణయించి, ...ందుగా ఫలానాపద్ధతి ప్రకారం తీయడమగునని సెంటరుక్లాసులకు తెలియపర్చవలెను. యింటరువ్యూల పద్ధతిని రద్దుచేయవలెను.

ఇంటరువ్యూలకు తాపత్రయ పడవలసిన అవసరముగాని, వానిప్రకారం వెళ్ళి ఖర్చుచేసుకొని వృథాగా తిరిగి రావడముగాని, జరుగదు. ఆరోగ్యవిషయములో డిప్యూటీయిన్‌స్పెక్టరువారునూ ...టి సైజ్ చేయునపుడే తెల్పి వేయుదురు గాన యింటరువ్యూల ప్రయోజనములేదు. ఈ ప్రకారం శ్రీ ప్రభుత్వము జరిపించినచో వృథాగా ఖర్చుచేయుటను తగ్గించినవారగుదురు. ప్రభుత్వవిధానముపై విమర్శలకు తావుండదని యీలేఖద్వారా మనవిచేయుచున్నాను.

మరుపల్లి నారాయణప్పలస్వామి,
టీచరు మేనేజరు-ములకలగుమడాం.

3. ప్రభుత్వపరీక్షలు 8 వ తరగతి

1. ఈ 1953 సం॥రం మార్చినెలలో జరిగిన E. S. L. C. VII Std. ప్రభుత్వపరీక్షలో తెనుగునమూన్చ (model) తప్పించియిచ్చినందున రాష్ట్రమొత్తంలో విద్యార్థులు తికమకలు పడినారనియు దానినిబట్టియే శాతము Percentage of Passed candidates) చాలవరకు తగ్గినదనియు, విదితమగు చున్నది. ఇటువంటి అవకతవకలు యికముందు జరుగకుండ నుండునట్లు చూడవలెనని ప్రభుత్వమును ప్రార్థించుచున్నాను.

2. S. S. L. C. ఇంటర్ మీడియట్, B. A. మొదలగు పరీక్షాఫలితములు జయముపొందిన విద్యార్థుల సర్టిఫికేట్లుగజెట్టు ప్రచురణకచ్చుట కాలస్యమైనను విద్యార్థులకు విసుగు కలిగించక పరీక్షలో నెగ్గిన విద్యార్థుల నెంబర్లు ముందుగా పత్రికలమూలమున ప్రచురించుట ఆచారమై యున్నది. 8. వ తరగతి ప్రభుత్వపరీక్షలు 1942 సం॥ రం॥ మొదలు జరుగుచున్నవి. సదరు పరీక్షలలో నుత్తీర్ణులయిన విద్యార్థులసర్టిఫికేట్లు ప్రభుత్వమువారు విద్యాశాఖాధికారికి, ఆటుపిమ్మట రేంజిడిప్యూటీ ఇనస్పెక్టరుద్వారా (through right channel) సంబంధముగల (to the concerned Headmasters) ప్రధానోపాధ్యాయులకు ముట్టచేయుటకును, తద్ద్వారా విద్యార్థుల కందచేయుటకు చాలకాలము తీసుకొనుచున్నది. ఇతరపరీక్షాఫలితములు ముందుగా ప్రచురపబడి, E. S, L. C. పరీక్షాఫలితములను ఆలస్యముగా తెలుపుటలో విద్యార్థులకు విసుగుకలుగుచున్నది.

3. అదియునుగాక సర్టిఫికేట్లు అందచేయుట కాలస్యమైన ఉన్నతపాఠశాలలలో IV వ ఫారము ప్రవేశము (Admission) పొందగోరు విద్యార్థులకు సీటుదొరకక పోవుటయును, తద్వారా (break of study) చదువు ఆగుటయును, జరుగుచున్నది. ఒకవేళ సీటు దొరకినను ఆలస్యముగాచేరుటవలన (term days) హాజరులో నియమావళి లేకపోవుటయు మొదలగు కష్టము లేర్పడుచున్నవి.

4. 1943 సం॥ రం॥ ప్రాంతమునందు మాత్రం 8 వ తరగతి ప్రభుత్వపరీక్షాఫలితాలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, మొదలగు పత్రికలమూలమున ప్రచురపరచబడినవి. ఆటుతర్వాత ఆరీతిప్రచురపబడుటను ఆపుటలో విద్యార్థిలోకమంతయు చాలవరకు అసంతృప్తి చెందినది. ఇకమీదనైనను అన్ని పరీక్షాఫలితములవలె E. S. L. C. viii Std. ప్రభుత్వపరీక్షాఫలితమును గూడా పత్రికలద్వారా ముందుగా ప్రచురపబచగోరి ఆ యా పత్రికాసంపాదకుల (Editors)ను సవినయముగా ప్రార్థించుచున్నాను.

5. E. S. L. C. VIII Std. ప్రభుత్వపరీక్షలో నుత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికేట్లను సక్రమమార్గముగా (through right channl) పంపుటవలన ఆలస్యమగుటచే వానిని నూటిగా పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులకు పంపి, విద్యార్థులకు సర్టిఫికెట్లను సకాలములో అందచేయునట్లు చూడవలయునని ప్రభుత్వమువారిని ఈ లేఖద్వారా ప్రార్థించుచున్నాను.

—కె. సిద్దలింగపిళ్ళై, టీచరు, తిరుపతి

బాలానందం:

ర

చిట్టిచెల్లాయి

పి. వి. యస్. వా.
పాచిపెంట

(1) కలదు నా కొక చిట్టిచెల్లీ!
ఆమెపేరే కల్పవల్లీ!
సాధునడతల పాలవెల్లీ!
చక్కదనమున జాన్‌బిల్లీ!

(2) లోతునీటను
ఈద గలుగును!
ఎత్తుకొండల
నెక్కుచుండును!
దూరదూరము
దుముక నేర్చును!
ఉరకవేసియు
పరుగుతీయును!

(3) పలుకులో మధురమ్ము చిందును!
పాటలో భావమ్ము నిండును!
నటనలో నవ్యతను జూపును!
నగవులో రతనాలు చిలుకును!

(4) మోమునందున కపటమన్నది
యేమియును కాన్పించ దెప్పుడు
స్వప్నమందుననైన చెల్లి - అ
సత్యమన్నది పలుకు నెఱుగదు!

(5) కథలు చదువును!
కవిత జెప్పును!
నటన జేయును!
నాట్య మాడును!
గర్వమన్నది
లేక యొప్పును
గుర్వులను - పూ
జింపుచుండును!

(6) కనకకాంతి గలట్టి చెల్లికి!
ఘనగుణమ్ములు గలుగు చెల్లికి!
కన్ను నొక్కటి కొఱతచేసెను
కటకటా! పాపిష్ఠిదైవము!

[ఒక యింగ్లీషు పద్యానికి స్వేచ్ఛానువాదం]

పొరపాటు

స్వ|| రాజు శ్రీ వేణుగోపాలరావు పంతులు, మునుగోడు.

(ఉదయం 8 గంటలు-పాఠశాలలో గురువుగారు విద్యార్థులకు పాఠములు చెప్తుతూఉంటారు - పెద్ద కాపు సీతయ్యగారు తనకుమారుడైన కృష్ణమూర్తిని పాఠశాలలో చేర్చటానికై తీసుకొనివస్తాడు)

సీత-పంతులూ! మా వాడుకూడ బల్లోకి వత్తుండడు కాని కాత్త శద్దతో సెప్పు, దెబ్బంటే దడు త్తడు. కల్లబెదిరించేం...

పంతు-అలాగే నిలుచున్నారేం? కూర్చోండి.

సీత-పనుందిలే యింటికాడ. యెల్తుండా! కాత్తబడికి రాకపోతే ఓరునన్నా పంపు; లేకుంటేనువ్వాన్నా పిల్చుకెల్లు పంతులూ! కేయ్! కిట్టమూర్తి! పంతులుకు పలకిచ్చి, అచ్చరాలు రాయిచ్చుకోరా! పంతులూ! వాణ్ణేకాత్త ముందేపంపు. బూకేడు త్తడు. (పోతుంటే కృష్ణమూర్తివాటేసుకొనిఏడుస్తాడు.)

పంతు-(కృష్ణమూర్తి చేయిపట్టుకొని)లే కృష్ణమూర్తీ! ఎందుకు ఏడుస్తావు? ఇలారా! ఇక్కడనాదగ్గర కూర్చుండిగానిరా! లేకపోతే మీ శంకరయ్య అడుగో! అక్కడ కూర్చుండిగానిరా! శంకరయ్యా! మీ కృష్ణమూర్తిని పిలూ! అజ్జో! బడిలోకివస్తూ ఏడుస్తారా ఎక్కడన్నా? అదిగో చూడు! మనబడిలో ఎన్నిగుఱ్ఱాలు, ఏనుగులున్నాయో? నీకు నిమ్మతొనలు యిప్పించనా? సీతారెడ్డి! ఈ అర్ధనా పట్టుకెళ్ళి నిమ్మతొనతెట్టుకోరా అబ్బాయికి. మీరు వెళ్ళండి. అబ్బాయి ఏడ్వడులెండి. (బాలుడు కోమటింటికి పోయి నిమ్మతొనలు తెచ్చి కృష్ణమూర్తికి యిస్తాడు. ఏడ్పుచాలించి అక్షరాలువ్రాయించుకొని దిద్దుకుంటాడు కృష్ణమూర్తి.) (నిష్క్రమణ)

(కొంతకాలము గడచింది)

సీత-(బడిలోనికివచ్చి) ఏంపంతులూ! ఎన్నాళ్లేడ్సినా వడ్డీలెక్కలు, నోటువ్రాయటం, సేతగాకపోయె. ఏంసదువు? ముండమోపిసదువు...

పంతు-కూర్చోండి సీతయ్యగారు! నోటువ్రాయటమేమిటండి? మీవాడు 5-వ తరగతి ఫస్టున ప్యాసయినాడు. ఫస్టుఫారములో చక్కగా చేర్పించవచ్చండి.

సీత-అట్టాగా! అయితే యింకేం చేర్పించవోయ్ పంతులూ! (నిష్క్రమణ)

(తిరిగి కొంతకాలము గడచింది)

(కృష్ణమూర్తి S.S.L.C. చదువుతూ తనమిత్రుడు గోపాల్‌తో స్వగ్రామము వచ్చాడు.)

కృష్ణ-రేయ్! గోపాల్! ఇదేరా మాబడి. మేము చిన్నప్పుడిక్కడే చదువుకున్నాంరా!

గోపా-అతనెవర్రా?

కృష్ణ-అతనేరా మా పంతులు పాపయ్య.

గోపా-పేరుకు దగ్గట్టుగానే ఉంటేంరోయ్ వేషము?

(అంటూ ఇద్దరూ నవ్వుకుంటూరు.)

(నిష్క్రమణ)

(మరికొంతకాలము జరిగింది)

(కృష్ణమూర్తి B. A. ప్యాసయి యింటికి వచ్చాడు. ఒకనాడు పంతులుగారెదురైనారు)

పంతు-ఏమోయి! ఎప్పుడువచ్చావు మద్రాసునుంచి?

కృష్ణ-మొన్న 17th న వచ్చాను పంతులూ! బడి బాగా జరుగుతుందా? మొన్న ఈ మధ్య బడి బాగా సాగటంలేదని మూసేశారనిఅన్నారే!

పంతు-లేదండీ! నాకు రెండు నెలలక్రిందట చలిజ్వరము వచ్చి చాలా బాధకలిగించిందండి. అందుచేత లేవలేక మంచంలో పడుకొని పాఠములు చెప్పుకుంటూ వచ్చానండి. అంతేగాని బడి మూయలేదే!

కృష్ణ-జాగ్రత్తగా చెప్పుకో కొంచెం.

పంతు-వెళ్ళొస్తానండి!

(నిష్క్రమణ)

(ఇంకా కొంతకాలంజరిగింది)

కృష్ణమూర్తి B A. B. L పూర్తిచేశాడు. ప్లీడరు వృత్తి స్వీకరించి తనగ్రామంవచ్చాడు. ఒకనాడు గురువుగారు పిల్లలను పిలుచుటకై వారింటి ముందుగా వెళ్తూ కృష్ణమూర్తివచ్చాడని తెలిసి చూడటానికై ఇంటిలో అడుగుపెట్టి)

పం-సీతయ్యగారూ! అబ్బాయిగారొచ్చారుట వున్నారండి?

కృష్ణ-ఎవరికేను?

తి-మనబల్లోపంతులు పాపయ్య గదట్రా!

పంతు-నమస్కారమండీ...

కృష్ణ-ఓహో అతనా! ఏమోయిపంతులూ ఈరోజు బడిలేదా! సెలవిచ్చారా!

పంతు-లేదండీ! రామయ్యగారమ్మాయి రాసుంటే పిలువటాని కొస్తున్నానండీ.

కృష్ణ-అయిన ఎలిమెంటరీస్కూళ్ళకు సెలవలెందుకు అనవసరంగా......

పంతు-సెలవిస్తారండీ?

కృష్ణ-(మాటవినిపించుకోకుండా లోపలికి వెళ్లాడు)

(నిష్క్రమణ)

(తిరిగికొంతకాలమైన మీదట)

(శాసనసభ ఎన్నికలహడావిడి, కృష్ణమూర్తి కాకినాడ నియోజకవర్గమునకు సభ్యుడుగా నిల్చాడు. 16 వేల రూపాయలు ఖర్చుపెట్టాడు, కాని కాకినాడలో ఒకనాడు బ్రహ్మాండమైన సభ ఏర్పాటు చేయుగా కృష్ణమూర్తి ఇలా ఉపన్యసిస్తాడు.)

కృష్ణ-అధ్యక్షా! సోదర, సోదరీమణులారా! శాంతి, సత్య, అహింసామూత్రాలచే మన గాంధీగారు మనకు స్వరాజ్యాన్ని తెచ్చియిచ్చారు. దాన్ని మనము చెడకుండా ఉంచవలెనంటే దేశములో విద్య, వినయం, శాంతం, ధర్మం, అహింస, నిలచియుండాలి. లంచగొండితనం, అధర్మం. అవినయం, జాతిమతవైషమ్యాలు, తుదముట్టాలి. అట్లు జరుగవలెనంటే అతి నిపుణులగు దేశనాయకులను మనము ద్రాసుశాసనసభకు ఎన్నుకోవలె. నేను మన కాకినాడ నియోజకవర్గానికి మన...పార్టీతరఫున నిలబడుచున్నసంగతి అందరికీ విశదమే కాబట్టి మీరందరు నాపై అనుగ్రహ ముంచవలెనని మనవి. ఇంతటితో విరమించుతా-బోలోభారత్ మాతకి!

(నిష్క్రమణ)

(మరల కొంతకాలమైనమీదట)

(ఎన్నికలలోకృష్ణమూర్తిగెలిచాడు. విద్యాశాఖామాత్య పదవి లభించింది. ఉపాధ్యాయులందరు తమ వేతనాలగురించి మహజరులు పంపుకున్నారు. అన్నీ బుట్టదాఖలయినవి. పైగా ఇప్పుడు పెంచటానికివీలులేదని చెప్పారు.) (మంత్రిగార్కి వివాహమైంది. ముగ్గురు పిల్లలు ఒకనాడు యింటికివచ్చారు మంత్రిగారు. పెద్దవాడైన రామారావును బడిలో చేర్చాలని గురువుగార్కి కబురుపంపారు.

పంతు-(కృష్ణమూర్తిగారింటికి వచ్చారు) మండీ కృష్ణమూర్తిగారు.

కృష్ణ-పంతులూ! మారాము బళ్ళోకి వస్తున్నాడు కాని కొస్త జాగ్రత్తగాచెప్పు. 8 వ ఏడు వచ్చేసరికి సెకండుఫారంలో చేర్చాలి.

పంతు-సరేనండి (చేతులుకట్టుకొని) మంత్రిగారూ? మా పంతుళ్ళజీతాలు పెంచుతారన్నారల్లే వుందండి.

కృష్ణ-ఇప్పుడేంపెంచటం. బడ్జెట్టులో డబ్బేలేకపోతే...ఎప్పుడూ జీతాలు పెంచే పనేటయ్యా, చదువూలేదు సంధ్యాలేదు.

పంతు-నాల్గుసెలలనుండి జీతాలు రావటంలేదండీ! డి.యి.ఒ. గారి ఆఫీసుకు 5 సార్లు తిరిగానండీ! పంపుతామంటారేగాని పంపటంలేదండీ!

కృష్ణ-పంపుతారులే. వారిపనులు చూచుకోవద్దూ. నీఒక్కడివనేన వార్కి?

పంతు-సెలవిప్పిస్తారాండీ!

కృష్ణ-(మాట వినకుండా లోపలికి వెళ్లాడు)

(నిష్క్రమణ)

(ఉదయం 10 గంటలకాలం రామారావు బడినుండి వస్తున్నాడు)

రామ-నాన్నా! నాన్నా! పంతులుగారే నాకే నిమ్మతొనలు పెత్తారే!

కృష్ణ-ఆ...

రామ-నిజంగ నాన్నా! నేనేతుంటే పెత్తారే!

కృష్ణ-(తనలో విచారంతో) తింటానికి తిండే లేదను అగురువుగారికి బడిలో పిల్లలకు (ప్రకాశంగా) నిమ్మతొనలు పెట్టేమాత్రం...

రామ-నాతేగాదునాన్నా! అందరితితలో దెంచిచ్చారే! (అని ఇంట్లోకిపోవును)

కృష్ణ-(పట్టరానిదుఃఖముతో) నేను క్రొత్తగా బడికి పోయిననాటిదృశ్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆహా ఏమి గురునిహృదయవాత్సల్యం!

పంతు-(సమయానికి పంతులుగారు వస్తారు) కృష్ణమూర్తిగారున్నారండీ!

కృష్ణ-(లోపలనుండి వస్తూనే నమస్కారమండీ గురువుగారంటూ కాళ్ళట్టుకున్నాడు.

పంతు-(లేవదీసి) ఇదేమిటండీ మంత్రిగారు?

కృష్ణ-ఏమిఉన్నది గురువుగారూ! అజ్ఞానాంధకారమున తెన్ను దెలియక అల్లాడుమా బాల్యావస్థకు మీదివ్యబోధ దీపప్రకాశము సుస్థిరమైన బాటను

వివేక ప్రశ్నలు

ఉద్యోగి పేరు నాల్గక్షరములు ;
ఒకటి వర్ణంబు తొలగిన - 'కర్షక'మగును ;
మూడవది తొలగ 'హస్తమునకు' చెల్లు;
అట్టి యుద్యోగి యెవ్వడో అరసి చెప్పుము. ౧

శ్రీ గుండేపూడి హనుమంతరావు - శనివారపు పేట.

ఒక్కనటినామ మొప్పు నాలక్కరముల;
అందు-'సతి, మన్మథుని భార్య, అజుని రాణి,
ఒక్క మాసపత్రిక,' పేరు లొప్పుచుండు ;
అట్టినటి యెవ్వరో చెప్పు డార్యులార ! ౨

శ్రీ బలివాడ నారాయణరావు,
8 వ తరగతి విద్యార్థి - పాచిపెంట.

మే నెల చిత్రప్రశ్నలు

(1953 స॥ మే నెల సంచికలో ప్రకటింపబడిన)

వివేక ప్రశ్నలు

అను చిత్రప్రశ్నలకు సమాధానములు

౧. ఉమాపతి. ౨. వరలక్ష్మి.

చందా నెం	రెండు ప్రశ్నలకు సరియైన జవాబులు పంపినవారు
136	తూమల అప్పలనాయుడుగారు - బేసిక్ హెడ్మాష్టరు - నడిమికెల్ల
572	ఆర్. దివాకరరాజుగారు - టీచరు మేనేజరు - రేగాటిపల్లి
18	భానూరు సత్యనారాయణ పట్నాయక్ గారు - హెడ్మాష్టరు - ఆవలంగి
533	డొంకాడ పెదసత్యనారాయణగారు - హెడ్మాష్టరు - అంపావిల్లి
497	బలివాడ నారాయణరావుగారు - 8 వ తర జూనియర్ విద్యార్థి - పాచిపెంట
341	భోగాపురపు సీతారామస్వామిగారు - హెడ్మాష్టరు కొట్టిశ
378	దోశల తమ్మిశెట్టిగారు - టీచరు - కింతలవానిపేట
156	దుంపరామమూర్తిగారు - టీచరు - చింతపల్లిపేట
385	రాజాం రామమూర్తిగారు బేసిక్ టీచరు - చోళ్ళపదం
230	రేగిడి సత్యనారాయణగారు - మేనేజరు - కోటిపాం
606	కలిదిండి సత్యనారాయణరాజుగారు - టీచరు - మొయిద
452	యం. శ్రీరాములుగారు - హెడ్మాష్టరు - దేవరాయపల్లి
340	వి. సూర్యప్రకాశరావుగారు - హెడ్మాష్టరు - అరసపాలెం

(౬౨ వ పేజీ తరువాయి)

చూపించింది. ఆ మార్గ మే నేజింతటి ఉన్నపదవి స్వీకరణ లభింపచేసినది. కృతఘ్నుడనై నేను తమ వాత్సల్యము మరచాను.

పంతు-విచారింపకండి! గతమును మరచిపోండి.

కృష్ణ-గతమును మరచు లేకాదు. ముందంజవేసి విద్యాశాఖను పునరుద్ధరించుటకనువగు నేర్పాట్లు చేసి, ఉపాధ్యాయవర్గమునకు తగు వేతనముల నిప్పించి, తిండిబడ్డలకు కరువులేకుండా చేస్తాను. ఇది తమపాదముల సాక్షిగా నిజము. గురువుగారూ! నాపొరపాటు మన్నించండి!

(నిష్క్రమణ)

27 వి. రామనాథశాస్త్రిగారు - టీచరు - పురిటిపెంట
ఎ. యల్. నరసరాజుగారు - టీచరు - గడేకల్లు
361 ఎ. వి. గోవిందరాజుగారు - హెడ్మాష్టరు - తోపుదుర్తి
184 కూచిభొట్ల పరశురామశాస్త్రిగారు - హెడ్మాష్టరు - పోలుకొండ

రెండవ ప్రశ్నకు మాత్రమే

278 టి. సత్యగోపాలాచారిగారు - హెడ్మాష్టరు జూటూరు
178 ఎ. వెంకటరత్నముగారు - టీచరు - శనివారపుపేట
381 భారతుల ఆంజనేయ శోభనాద్రిశర్మగారు - టీచరు - శనివారపుపేట

పదపూరణము - సమాధానములు


1. కలము	1. నౌక
2. హలము	2. మూక
3. శూలము	3. రూక
4. శీలము	4. మేక
5. వాలము	5. కైక
6. ఫాలము	6. ఊక

చందా నెం సరియైన జవాబులు పంపిన విద్యార్థులు

చి॥ గిరడ రామునాయుడు - 8 వ తర - శంబర
చి॥ మోణంగి సూర్యప్రకాశరావు - 7 వ తర - శంబర
చి॥ పోతల నూకాలయ్య - ప్రయివేటువిద్యార్థి - పెదనాయుడుపాలెం
చి॥ లాలం సత్యనారాయణ ,, ,,
చి॥ శబ్బవరపు అచ్చంనాయుడు ,, ,,
చి॥ నారపాడు దేవుడు ,, ,,
చి॥ మండల స్వామినాయుడు ,, ,,
చి॥ పైల కిష్టంనాయుడు - ,, ,,
చి॥ అరసాడ కేశవరావు - 8 వ తర - ప్రయివేటు విద్యార్థి - పెదనాయుడుపాలెం
చి॥ సబ్బవరపు స్వామినాయుడు ,, ,,
చి॥ దంగేటి సన్యాసిశెట్టి ,, ,,
చి॥ అరసాడ నారాయణరావు - 4 వ తర విద్యార్థి - సబ్బవరం
చి॥ గుంపిన నరసింగరావు - 8 వ తర ప్రయివేటు విద్యార్థి - ఇలువాడ
చి॥ శ్రీమతి కుప్పిలి కనకరత్నం - 6 వ తర - శంబర
180 చి॥ దుంపనారాయణమూర్తి - విద్యార్థి - చింతపల్లిపేట
497 చి॥ బలివాడ నారాయణరావు - 8 వ తర విద్యార్థి - పాచిపెంట
చి॥ యలమంచిలి కోటేశ్వరరావు - 8 వ తర విద్యార్థి - పోలుకొండ

పదపూరణము

వ్యర్థులు మాత్రమే వీనిని పూరింపవలెను. చందాదారులు కాని వారు తప్పనిసరిగా రెండు ల తపాలాబిళ్ళలు పంపవలెను. లేనిచో వారిపేర్లు ప్రకటింపబడవు.]



వి. రా:-మధ్యఉన్న 'రు' అక్షరమును కలుపుకొని యీ క్రింద తెలిపిన అర్థములకు సరిపోవునట్లు ఆయాసంఖ్యల పదములను పూరింపవలెను.

పదము	అర్థము
1,5 సంఖ్యలు	మనుష్యుడు
2,6 సంఖ్యలు	పెండ్లికొడుకు
3,7 సంఖ్యలు	స్త్రీలుకష్టపడేసమయం
4,8 సంఖ్యలు	కడచినసంవత్సరము

— శ్రీమతి నరిసిపురం ఇందిర - విద్యార్థిని,
కె. బి, యం. పి, పాఠశాల - చిడుమూరు,

చందాదారులకు మనవి

కారణాంతరములవలన జూలై నెల పత్రికను ప్రచురింపజాలకపోవుదుమేమో. జూలై పత్రికను ప్రచురించినయెడల మామూలుగా మీకు పంపబడును. జూలై 20 తేదీలోగా మీకు పత్రిక అందనిచో సదరు పత్రిక ప్రచురింపబడలేదని భావించి, ఉత్తర ప్రత్యుత్తరములు వ్రాయవలదనిగా తెల్పుచున్నాము.

ఇట్లు,

ది 15-6-1953.

ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య,
రామా అండ్ కో., ఏలూరు.

వింతపదములు - పొడుపుకథలు


[తమ్ముళ్లూ! చెల్లాయిలూ! ఈ క్రింద కొన్ని వింతపదములు - పొడుపు కథలు ఉన్నవి. వీటి సమాధానాలు చాల గమ్మత్తుగా ఉంటవి. మీరందరూ వీటిని చక్కగా నేర్చుకోండి. మీకు తెలిసిన పొడుపుకథలుంటే వ్రాసి పంపండి. అయితే అవి చాల గమ్మత్తుగా - క్రొత్తవిగా ఉండాలి.]


పదము	జవాబు
రాజుకాని రాజు	తరాజు
రాయికాని రాయి	పరాయి
భజనకాని భజన	విభజన
దానముకాని దానము	నిదానము
దేశముకాని దేశము	ఆదేశము
కరణముకాని కరణము	వ్యాకరణము
గడముకాని గడము	వంగడము
సింహముకాని సింహము	నృసింహము
రకముకాని రకము	మారకము
కులముకాని కులము	నకులము

కూర్పరులు : 1. శ్రీ ఎ. యల్. నరసరాజు, 2. శ్రీ ఎ. అశ్వత్థరాజు.

బంగారు చెంబులో వెండిగచ్చకాయలు	పనసతొనలు
ముగ్గురు బిడ్డలకు ఒకటే టోపి	తాటిపండు
ఇద్దరు సోదరులకు ఒకటే మొల	తుమ్మముల్లు
నన్నుగట్టి మాయమ్మ శివాలాడింది	కవ్వము
దాకిసిచ్చినవేయుట	శాస్త్రం చెప్పుట
తెల్లనిమడిలో నల్లనివి త్తనాలు - నోటితో పల్లుట - చేతితో దున్నుట	- వ్రాత

కూర్పు: చి|| కె. నాగభూషణం - 8 వ తర. విద్యార్థి - కోళ్ళపాలెం.





ప్రాథమిక విద్యావిధానములో మార్పు

మనకు స్వాతంత్ర్యము వచ్చినప్పటి నుండీ ప్రాథమిక విద్యాభివృద్ధికై ప్రభుత్వం ఎన్నోమార్పులు చేస్తున్నది. మొదట్లో కొన్ని నియమిత ప్రదేశాలల్లో నిర్బంధ విద్యావిధానాన్ని అమలుపరిచింది. అయితే ప్రజాసహకారం లేనందువల్ల, ప్రభుత్వం గట్టిగా చర్యతీసుకోనందువల్ల, అది జయప్రదంగా కొనసాగలేదు. గట్టిగా దెబ్బ తిన్నదనే చెప్పవచ్చు. తరువాత పిట్టపద్ధతి అమలుపరచింది. దాన్ని జయప్రదంగా కొనసాగించటానికిగాను ఉపాధ్యాయులకు నెలకు పదిరూపాయల చొప్పున అదనపు జీతంకూడా యిచ్చింది. కాని యిది చివరకు ఒకనాటకంలాగా పరిణమించి ఫలప్రదం కాకపోయింది. ఇకపోతే వయోజనవిద్యాభివృద్ధికిగాను పెద్దఎత్తున ప్రభుత్వం ప్రణాళికలను అమలుపరచింది. అందుకై కొన్నిలక్షల ద్రవ్యాన్నికూడా ఖర్చుపెట్టింది, ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన తరిబీదునుకూడ యిప్పించింది. కాని ఎన్ని చేసినప్పటికీ, ఎంత డబ్బువెచ్చించినప్పటికీ, వయోజనవిద్యాభివృద్ధికూడ నామమాత్రంగానే జరిగింది. ఈలాటిప్రణాళికలన్నీ ఫలప్రదం కాకుండ నిలిచిపోవటానికి ముఖ్యకారణాలు ప్రజాసహకారం లేకపోవుట-ప్రభుత్వం తగినంత గట్టిచర్య తీసుకో లేకపోవుట - ఇందువల్ల విద్యావిధానంలో ఎన్నిమార్పులు తెచ్చినప్పటికీ పై రెండు కారణాలు చక్కబడే వరకువిద్యాభివృద్ధిజరుగనేరదనేచెప్పవచ్చు.

ప్రస్తుతం ఈనెలనుండిప్రాథమిక విద్యావిధానంలో ఒకక్రొత్తమార్పును అమలుపరుపనెంచిందిప్రభుత్వం. ఈమార్పుమైనరు పంచాయతీ గ్రామాలలో ఉండే లోయరు ఎలిమెంటరీస్కూళ్ళకు మాత్రమేఅనువర్తిస్తుంది. మేజరుపంచాయతీ, మునిసిపాలిటీ గ్రామాలకు బేసిక్‌స్కూళ్ళకు, యిది అనువర్తించదు.

ఈమార్పువల్ల ముఖ్యంగాబోధనకాలం సగానికి సగం తగ్గించబడింది. ప్రతిపాఠశాల రెండు భాగాలుగా విభజింపబడుతుంది. అంటే ప్రతితరగతి రెండుభాగాలుగా పనిచేస్తవి. ప్రొద్దుటపూట ఒకభాగము; సాయంత్రము ఒకభాగము. ప్రొద్దునవచ్చే విద్యార్థులు సాయంత్రం రానక్కరలేదు. సాయంత్రం వచ్చేవాళ్ళు ప్రొద్దునరానక్కరలేదు. అంటే ప్రతితరగతి విద్యార్థులు బడికిరావలసినది, ఒక్కపూటేనన్నమాట. అయితే రెండోపూటవారువారు ఇంట్లోనేకూర్చుండరాదు, యేదో ఒకవృత్తికి సంబంధించిన పనిలో వారు నిమగ్నులై

ఉండాలి. ఇదికూడ విద్యాబోధనలో చేరిన ఒకభాగంగా పరిగణింపబడుతుంది. అంటే ఈమార్పువల్ల ప్రతివిద్యార్థికి మామూలు విద్యతోబాటు ఏదోఒకవృత్తి విద్యకూడ నిర్బంధం చేయబడిందన్నమాట. ఈమార్పు ప్రకారం పాఠశాలలో చదివేవిద్యార్థులు ఏదోఒక రకమైనకులవృత్తికి అనగా వ్యవసాయము, కమ్మరము, కుమ్మరము, వడ్రంగము, నేత, మేదరము, మొదలగు వృత్తులకు సంబంధించిన వారైతే వారికి ప్రత్యేకముగా వృత్తివిద్యను నేర్పవలసినపనిలేదు. అట్టివారందరు తమ ఇండ్లవద్దనే తల్లిదండ్రులతోబాటు ఆయాపనులలో పాల్గొంటూ ఆయావృత్తివిద్యలను నేర్చుకుంటారు. ఇందువల్ల పిల్లలకు వృత్తివిద్యాపరిజ్ఞానము సాధారణవిద్యతోపాటు అలవడుటయేకాక, జీవనోపాధి అంతగాలేనితమ తల్లిదండ్రులకు కుటుంబపోషణలో కొంతసాయపడినవారవుతారు. ఇక బాలికలకుకూడ వృత్తివిద్య ప్రత్యేకంగా బోధింపనక్కరలేదు. ఇండ్లలోనే తమతల్లుల ఆజమాయిషీక్రింద ఇంటిపనులు, వంటపనులూ, మున్నగునవి నేర్చుకుంటారు. కాబట్టి వారికి వృత్తివిద్యలో ప్రత్యేకశిక్షణ ఇవ్వనక్కరలేదు.

ఇకపోతే ఏవృత్తికి చెందని విద్యార్థులు ప్రతిపాఠశాలలోను కొద్దిమంది మాత్రము ఉంటారు. వారు ముఖ్యంగా బ్రాహ్మణ వైశ్యకుటుంబములకు చెందినవారై ఉండవచ్చు. ఈ మార్పు ప్రకారం వీరికికూడ ఏదో ఒక వృత్తివిద్యను నిర్బంధంగా నేర్పాలి. అందుకై వీరిని ఆ గ్రామంలో ఉండే ఏపనివానివద్దనైనా అప్పగించాలి. ఆపనివాడు వీరికి ఏదోవిధంగావృత్తివిద్యను నేర్పాలి. వీరందరు తనవద్ద పనిక నట్లు ప్రతిరోజు అటెండెన్సు తీసుకోవాలి. ఇందుకుగాను ఒక హాజరుపట్టీ రిజిష్టరును కూడ అతడు ఉంచుకోవాలి. ఒకవేళ ఏ గ్రామంలోనైనా పనివాడు లేకపోతే మేనేజిమెంటువారు ఇతర గ్రామంనుంచి ఒక పనివానిని రప్పించాలి. పాఠశాలకు తగినంత ఆవరణం ఉంటే దానిలోనే అతనికి ఒక పాక నిర్మించి, అతనికి జీవనోపాధి కూడ కల్పించి, వారివారికి రుచించినవృత్తి విద్యలు అతనివల్ల నేర్పించాలి. వ్యవసాయపుపనులప్పుడు రైతులవద్దకు పంపిస్తూ, ఆపనులు లేనపుడు పనివానివద్ద అప్పగిస్తూ, ఏదోరకముగా ఈకొద్దిమంది విద్యార్థులకు వృత్తివిద్య బోధింపబడేటట్లు చూడాలి. అయితే మొదట్లో వారికి ఆ యా వృత్తివిద్యలు రాకపోయినప్పటికీ క్రమక్రమంగా వారే నేర్చుకోగలరు.

ఇందుకు తోడు విద్యార్థులను చిన్నచిన్నజట్లుగా విభజించి గ్రామాభ్యుదయ కృషికి అనగా పాకలు నిర్మించుట, గోడలు కట్టుట, బావులు త్రవ్వుట, రోడ్లు వేయుట, మున్నగు వాటికి ఉపయోగపడు లాగున ఉపాధ్యాయులు వారిని తయారు చెయ్యాలి, ఇందువల్ల గ్రామంలో ఉపాధ్యాయుని గౌరవప్రతిపత్తులు అతడు కొనసాగించు కార్యక్రమమునుబట్టి పెంపొందగలవు.

ఈ విధానము జయప్రదముగా కొనసాగుటకుగాను ఉత్సాహవంతులైన గ్రామస్థులనుచేర్చి కమిటీలుఏర్పాటుచేయవలెను.

విద్యాబోధన ఒకపూటకు మాత్రమే పరిమితము చేయబడినప్పటికీ ప్రణాళికలో

సంపాదకీయము

విద్యాబోధన ప్రమాత్రము ...రాదు. వారానికి 35 పీరియడ్లలో బోధింపబడు విద్యలన్నియు ఈ పరిమిత కాలములోనే బోధింపబడవలెను. అవసరమైతే వారమునకు 6 రోజులు పనిచేయవలసి ఉండును.

సూత్రప్రాయముగా ఈ మార్పులోని సారాంశమిది. స్థూలదృష్టితో విచారించిన యిందలి సాధ్యాసాధ్యములు కొంతవరకు బోధపడగలవు. ఈమార్పువలన అసలు విద్యాబోధన దెబ్బతినునేమో అన్న సందేహము కలుగవచ్చు. ఆ యా వృత్తులవారికి వృత్తివిద్యలు అలవడునేమోకాని తక్కిన వారికి మాత్రము అలవడుట సందేహాస్పదము. అసలు తల్లిదండ్రులు తమ బిడ్డలను యీ వృత్తివిద్యాశిక్షణకు పంపుదురా అని కూడ సందేహింపవలసియున్నది. ఒకవేళ పంపినప్పటికీ ముక్కుపచ్చలారని ముద్దు కుర్రలు-ఏడేండ్ల మించేండ్లు కూడా నిండని చిరుతలు - ఏమి వృత్తివిద్య నేర్చుకోగలరు? రైతుతోబాటు ఎండ వానలకోర్చి పొలములో పనిచేయుగలరా? పనివానివద్దకు పోయి అతడు చెప్పిన ప్రకారం కష్టపడగలరా? ఈలాటి సందేహములు ఎన్నోకలుగవచ్చు. అదిగాక పనివాడు ఉచితముగా వీరికి పని నేర్పునా? పనివారు లేని చోట పొరుగూరి నుండి పనివానిని రప్పించి, అతనికియిల్లు-వాకిలి-తగినజీవనోపాధి-ఏర్పరచి, మేనేజిమెంటువారు కాపాడించగలరా! ఈ అదనపు ఖర్చును ప్రభుత్వసహాయము లేకుండా పాఠశాలలు భరింపగలవా? ఈలాటి ప్రశ్నలు కూడ ఉదయింపవచ్చు. ఈమార్పువల్ల ఉపాధ్యాయునిబాధ్యత ఎక్కువగుచున్నదే కాని వేరే ప్రయోజనము కల్పించుటలేదు. ఒకవేళ వృత్తివిద్యను నేర్పు పనివాడుకాని, రైతుకాని, చదువురానివాడైతే హాజరు పట్టీని పూరించుట ఎట్లు? వడ్రంగము-కమ్మరము మొదలైన పనులు చేయుటకు చిన్నవయస్కులైన విద్యార్థులు చాలుదురా? ధనవంతులు తమ బిడ్డలను ఈలాటి పనులకు పంప ఇష్టపడుదురా? ఇది వారికి జీవనాధారకమగు వృత్తివిద్య కాగలదా? ఈలాటి సందేహములుకూడ కలుగవచ్చు. వీటికి సమాధానము ప్రభుత్వమే చెప్పవలెను.

ఈ మార్పులో సూచింపబడిన అంశములు సిద్ధాంతరీత్యా ఆమోదకరములుగా ఆకర్షణీయములుగా - అభ్యుదయజనకములుగా - ఉన్నప్పటికి ప్రస్తుత పరిస్థితిలో ఆచరణ సాధ్యములుకావేమో అని మా సందేహము. ఈ విధానముకూడ పూర్వపు విధానములవలె దెబ్బతినకుండునట్లు అందువల్ల అసలు విద్యాభివృద్ధి కుంటుపడకుండునట్లు ప్రభుత్వము గట్టి చర్యతీసుకొనవలెననీ, ప్రజాసహకారమునకు విద్యాధికారుల ద్వారా తగినంత దోహదము కలిగింపవలెననీ, ఉపాధ్యాయుని బాధ్యత సాధ్యమైనంతవరకు తగ్గింపవలెననీ, ప్రభుత్వమునకు మా మనవి.

సంపాదకుడు.

గమనిక

1. చిత్రప్రశ్నలకు, పదపూరణమునకు, సమాధానములు పంపువారు మా పత్రికకు చందాదారులుకాని పక్షమున తప్పనిసరిగా రెండు అణాల తపాలాబిళ్ళలు పంపవలెను. లేనిచో వారిపేర్లు ప్రకటింపబడవు. చందాదారులు తమ చందానెంబరును విధిగా ఉదహరించాలి.

2. ప్రశ్నలకు, పదపూరణమునకు, సమాధానములు - వ్యాసములు - మున్నగునవి పంపువారు ప్రతినెల 4 వ తేదీలోగా "సంపాదకుడు - ఆంధ్రరాష్ట్ర ప్రారంభ విద్య - అమరావతి (P.O.) గుంటూరుజిల్లా" అను చిరునామాకే సరాసరి పంపుచుండవలెను. అట్లుగాక ఏలూరుకు పంపుటవలన అవి సకాలములో మాకు చేరకపోవుటయు, ఆనెలసంచికలో అవి ప్రకటింపబడక పోవుటయు, జరుగవచ్చు. అదిగాక అదనపు తపాలాఖర్చులు కూడ మాకు కలుగవచ్చు. కాబట్టి ముఖ్యముగా సమాధానములు పంపువారు దీనిని గమనింపవలెను.

3. వ్యాసములు పంపువారు కాగితమునకు ఒక ప్రక్కనమాత్రమే విడివిడి పంక్తులలో, కొట్టుకొట్టులేకుండ వ్రాయవలెను. పేజీకి రెండుప్రక్కల వ్రాసిన వ్యాసములు స్వీకరింపబడవు.

4. తపాలాచార్జీలు పెరిగినవి కాబట్టి బుక్‌పోష్టుద్వారా పంపువారు సరియైన తపాలాబిళ్ళలు అంటించి పంపవలెను. లేకున్న అట్టివి త్రిప్పివేయబడును. దీనిని కూడ ముఖ్యముగా గమనింపవలెను.

5. ప్రతినెల సకాలములో పత్రికలు చేరనివారు "రామా అండ్ కో., ఏలూరు." చిరునామాకు వ్రాసి తెప్పించుకోవలెను గాని నాకు వ్రాసినందువల్ల ప్రయోజనముండదు. పంపించుటకు నావద్ద కాపీలుండవు. చందాదారులు ఈ విషయమును తప్పక గమనింపవలెను.

6. తమ చందాలు అయిపోయినవారు, క్రొత్తగా చందాదారులుగ చేరువారు, తమ చందాధనమును మనియార్డరుద్వారా సరాసరి "రామా అండ్ కో., ఏలూరు" చిరునామాకే పంపుచుండవలెను, నాకు పంపవద్దు.

సంపాదకుడు.

జూన్ 15 నుండి జూలై 14 వరకు మాసఫలములు.

మేషరాశివారికి:—జూన్ 23 లోపల మనోచాంచల్యము, భయము, అధికార, బంధు, అద్దెకున్న వారు, గృహయజమానులు మొదలగువారితో బాధలు కల్గును. అజీర్ణాదిరోగ భయమును, శత్రువులవలని, మోసము, ఉద్యోగ వ్యాపారాలలో నష్టము 24 టు 29 లోపల కళ్యాణాది శుభములు, వినోదములు నూతనయత్నములకు లాభము, వ్యాపారాభివృద్ధి, జూలై 9 టు 12 లోపల అపాయాదిపరిస్థితులు, ప్రయాణ విఘ్నములు, అనారోగ్య విషజంతుభయం సంతాన భ్రాతృవర్గములో వారికి చిక్కులు శ్రమ ఎక్కువగును. 13, 14 లలో ఉద్యోగమార్పులు మోసము. వ్యాపారనష్టము చిక్కు లెక్కువగా నుండును.

వృషభరాశివారికి:—జూన్ 21 లోపల ఆర్థికచిక్కు లెక్కువ. పుత్రులతో వైరము. వ్యాపార నష్టము. కార్యవిఘ్నములు 29 లోపల ప్రయత్నముమీద కార్యానుకూలమగును. నూతన కార్యాదుల వలన సద్వ్యయము. జూలై మొదటివారముకూడ నడచును. 9 టు 12 తేదీలలో దావాలలో నష్టము. శత్రువృద్ధి ధననష్టం-అపాయాది పరిస్థితులు. భూసంబంధమైన చిక్కులు కళత్రారోగ్యభంగం. 13, 14 తేదీలలో ఉద్యోగంలో చిక్కులు, సంతానమునకు బాధలు. కంట్రాక్టులు మొదలైనవేవియు కూడవు.

మిథునరాశివారికి:—జూన్ 20 లోపల ఆరోగ్యభంగం, మనోచాంచల్యం, వ్యాపారాదికార్యము లలో మందస్థితి, కొన్ని కార్యవిఘ్నములు, కలుగును. జూన్ 30 లోపల కొన్ని నూతనకార్యాలలో కళ్యాణాది శుభకార్యాలలో వ్యాపార, వినోదాలలో అనుకూల మెక్కువగా నుండును. వ్యాపారం బాగుండును. జూలై 12 లోపల శత్రునౌకరీ జనాలవలన, కొందరు మిత్రులవలన కొన్నిచిక్కులు, ఆటంక ములు జరుగును. కార్లు, విమానాలు మొదలగువానిలో ప్రయాణాలవల్ల చిక్కులు రాగలవు. జాగ్రత్త అవసరము. 13, 14 లలో ప్రయాణవిఘ్నములు, ఆర్థికనష్టము, వ్యాపారాది కార్యభంగం లేకఆటంకము జరుగును.

కర్కాటకరాశివారికి:—21 వరకు పొరుగువలన, గృహయజమానులవలన ప్రత్యక్ష, పరోక్ష, శత్రు త్వములవలన మోసము, చిక్కులు తటస్థమగును. అనవసర విరోధములు ప్రయాణాదులలో కొంత ఆటం కము కలిగి మనస్సు చికాకుచెందును. జూన్ 30 లోపలబంధుమిత్రుల ద్వారా కొంత మనశ్శాంతి, గృహ సౌఖ్యం, ఉద్యోగలాభం కొంతవరకు శుభఫలములు జరుగును. జూలై 14 వరకు అనవసర ధనవ్యయం. కార్యవిఘ్నములు, అధికారవిరోధం చోరభీతి, విషజంతుభయం. సంతానాదులలో అపాయాది పరిస్థితులు మొదలైన దుష్టఫలము లెక్కువగును. యంత్రములు, పశువులు మొదలగువానివలన అపాయము రావచ్చును.

సింహరాశివారికి:—జూన్ 20 లోపల మిత్రులవలన ధనవ్యయం రావలసిన సొమ్మునకు భంగం జూలై 5 లోపల ధనలాభం, శుభకార్యాలు, వ్యాపారవృద్ధి, జూలై 14 వరకు కష్టముమీద విద్య, గృహ విషయము లనుకూలించును. ఆరోగ్యభంగం కల్గును. అనవసరకలహములు, అందువలన భయ, అపాయ ములు కల్గును. నూతనకార్యాలు చేయరాదు. వ్యాపారాదులకు మంచిదికాదు.

కన్యారాశివారికి:—జాతకునకు, సంతానానికి అనారోగ్యం, ఉద్యోగశ్రమ, జూన్ 21 తర్వాత కొంత శాంతిని జెంది జూలై 5లోపల ధనలాభం, ఉద్యోగాభివృద్ధి చెందుట. జూన్14లోపలకార్యాలందు తొందర వహించక వ్యాపారాది కార్యాలు నిదానంగా చక్కబెట్టుకోవలెను. లేనిచో చిక్కులు కల్గును. సోదరవర్గంలో వారికి, మాతృవర్గములోనివారికి చిక్కులు వచ్చును.

తులారాశివారికి:—జూన్ 17 లోపల కార్యలాభం 21 లోపల గృహవ్యాపారాది చిక్కులు. జూలై 6 లోపల శుభకార్యాలు, వ్యాపారలాభం జూలై 12 లోపల విశేషలాభం స్థానచలనం13-14లలో ఆరోగ్యభంగం. వ్యాపారాది కార్యాలకు మంచిదికాదు చిక్కుకల్గును.

వృశ్చికరాశివారికి:—జూన్ 20లోపల ఆరోగ్యభంగం, స్థానచలనం, గృహసంబంధమైన చిక్కులు. జూలై 2 లోపల కొంతమేలు, 9 టు 12 లోపల విరోధాలు ప్రబలి అపాయాలు కలుగును. 14 లోపల ఉద్యోగ వ్యాపారాలలో చిక్కులు. ఈమాసం మొత్తంమీద ఎక్కువ కష్టాలు కలుగును.

ధనూరాశివారికి:—జూన్ 20 లోపలఆర్థిక చిక్కులు; వ్యాపారము కొంతమందస్థితికిగాని, విఘ్నా లకుగాని గురియగును. జూలై 7 వరకు వ్యాపారం బాగుండును, నెమ్మదిగా వృద్ధియగును. జూలై 12 వరకు వ్యాపారం బాగుండి లాభం కల్గును. 13, 14 లలో ప్రయాణవిఘ్నాలు ధననష్టం, భూవ్యయం నూతన

వ్యాపారాదులు, కంట్రాక్టు వగైరాలు కూడవు. కొంతనష్టము కల్గి వ్యవహారాదికొరకు నెరవేర్చుకొనవలసియుండును.

మకరరాశివారికి:— జూన్ 20 లోపల శత్రువర్గమువారితో విరోధాలు, దావాలలో చిక్కులు వ్యాపారనష్టం జూలై 1 లోపల సంతానాదులలో అభివృద్ధికళ్యాణాది శుభములు, వ్యాపారలాభము. 14 లోపల భూస్థల విక్రయాదులు, వ్యాపారనష్టం, ధనవ్యయం, ఆరోగ్యభంగం మనశ్చాంచల్యం అనవసర పేచీలు, చిక్కులు కల్గును.

కుంభరాశివారికి:— జూన్ 20 లోపల బుద్ధి నిలకడ లేక మనస్సు గుంజాటన పడును. ధనవ్యయ మెక్కువగును. జూలై 6 లోపల వ్యాపారాది కార్యాలవలన కళ్యాణాదిశుభములవలన క్రయవిక్రయాదులవలన సంతోషముకల్గును. స్థానచలనము. నూతనగృహసౌఖ్యం కల్గును. 14 లోపల కార్యములందు తొందర కూడదు. సావాసదోషంవలన అనవసరచిక్కులకు లోబడవలసి వచ్చును. వ్యాపారాది కార్యాలలో చిక్కులు కల్గును. ఆరోగ్యభంగం. నిదానంగా వ్యవహరించవలసి యుండును.

మీనరాశివారికి:— జూన్ 21 లోపల గృహమందు కొన్నిచిక్కులు, కష్టమందు కొన్ని శుభకార్యాలు నెరవేర్చుకొనుటకు మార్గము లేర్పడును. భూ విక్రయము జరుగును. జూలై 1 వరకు బంధుసమాగమము స్వల్పలాభ, సౌఖ్యాలు కల్గును. జూలై 12 వ తేదీ లోపల ఉద్యోగములో చిక్కులు, స్థానచలనము, సంతానములో నవారోగ్యాలు, శత్రులు మిత్రులౌదురు. భూగృహ సంబంధమైన వ్యవహారా లనుకూలంగ మారును. తొందరపడకు, నూతన వ్యాపారాది కార్యములు గూడవు.

ఇట్లు,
లక్కావఝ్ఝుల సర్వయ్య,
జ్యోతిష్కులు - ఏలూరు,
10—6—53.

చిత్తూరుజిల్లా కళాపరిషత్తు

ది 27-5-1953 తేదీన చిత్తూరులో తపోవనమునందు చిత్తూరుజిల్లా కళాపరిషత్తు ప్రప్రథమసభ సమావేశమాయెను. సాహిత్య విశారద విద్వాన్ శ్రీ జి. చెన్నారెడ్డి M. A; B .O. L; B. Ed గారు (తిరుపతి వెంకటేశ్వర కళాశాల ప్రధానాంధ్రోపన్యాసకులు) అధ్యక్షత వహించిరి. జిల్లా నలుమూలలనుండి పండితులు, కవులు, రచయితలు' నటులు, గాయకులు, చిత్రలేఖకులు, సుమారు రెండువందలమంది విచ్చేసిరి. పాఠకపరిచిత రచయిత యగు శ్రీ కె. సభా గారు ప్రారంభోపన్యాసము చేయుచు, ఆంధ్రరాష్ట్రములో చిత్తూరుజిల్లా కళానిధులకు పేరెన్నికగన్న జిల్లా. ఆంధ్రవిశ్వకళాపరిషత్ స్థాపక ప్రతిభావంతులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారును, శేముషీ ధురంధరులైన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణగారును, ప్రఖ్యాత గాయకులు, నటులు, నగు శ్రీ వి. నాగయ్యగారును మనజిల్లాలో జన్మించినవారే. కాని మనము ఒకరిద్దరి ప్రఖ్యాతిని ప్రకటించుకొనుటతో తృప్తిజెందరాదు. ప్రతిరచయితయూ రామలింగారెడ్డివలె రంజిల్లవలెను. ప్రతిగాయకుడును నాగయ్యకు వారసుడై వాసికెక్కవలెను. అట్టిఅభ్యుదయమును అందుకొనుటకు ఎవరికి వారు వ్యక్తిగత ప్రయత్నముకంటె ఏకోన్ముఖమైన ఎత్తుగడ శ్రేయోదాయకము. తదాశయము నేటి మన మండల కళాపరిషత్తు కృషితో కొనసాగగలదని ప్రస్తావించిరి.

పిమ్మట కంబరామాయణ ఆంధ్రీకరణకర్త, తెలుగు పండితులు, నగు శ్రీ పూతలపట్టు శ్రీ రామిరెడ్డిగారు ప్రసంగించుచు అన్నమయ్యాచార్యులవంటి మహామహులు,మనపితామహులు. అష్టదిగ్గజాలలోనొకరైన ధూర్జటివంటి మహాకవులు మనజిల్లావాసులు. సారంగపాణి, కవిచౌడప్పలాంటి మధురకవులు మనమండలములోనివారే. తరిగొండ వేంకమాంబ వంటి కవయిత్రులు మన ఆడపడుచులు. గతచరిత్రలో ఘనులుండియూ నేటికి మనజిల్లా పేరు ప్రఖ్యాతులు ఆంధ్రదేశములో అంతగా వెలయలేదంటే మనకు సమిష్టిప్రయత్నము లేకపోవడమే ముఖ్యకారణము.

...ట్ర కళాపరిషత్తుల కృషివలనతీరి, ...కారులు సృష్టింపబడగలరని చెప్పిరి. ...త్రము పత్రికలలో క్రమక్రమముగ పాఠ్య పుస్తకములలో పరంపరగా ప్రాకిపోవుచున్న గ్రామ్య వ్యవహారిక భాషవల్ల స్వచ్ఛంద ఆంధ్ర సారస్వతామతల్లికి ప్రగతిపోయి భ్రష్టత కల్గుచున్నది. సాధ్యమైనంతవరకు గ్రాంధిక భాషాభివృద్ధికే పాటుబడవలెనని పల్కిరి. నవ్యసాహిత్యము వలన నాంధ్రభాష సర్వజనులకు సులభగ్రాహ్యమగుటయే గాక నాటకపాత్ర పోషణకు, భావప్రకటనకు, చక్కగ సహకరించినదని శ్రీ రామస్వామి అయ్యంగార్ తెల్పిరి. తరువాత పలువురు పెక్కుతీరుల పరిషత్ ఆవశ్యకతను గూర్చి వక్కాణించిరి.

అనంతరము అధ్యక్షులు అంత్యోపన్యాసమందు కొని రాయలనాటి సర్వకళల సంపోషకత్వమును ఉదాహరించి, పూర్వమెట్లు తెలుగునాడులో కళాభివృద్ధి కల్గినదో కొనియాడిరి. ఆనాడు ఒక్కవ్యక్తి అనగా రాజుయొక్క అభిరుచులనుబట్టి కళలు ప్రోత్సహింపబడు చుండెడివి. నృపాలుని ఉత్సాహము కొలది కళలు ఉన్ముఖ మెత్తుచుండెడివి. కాని నేడు కళలకు పాలకుల ప్రాపుపోయి, ప్రజల ప్రోత్సాహములపై ప్రతిష్ఠించుకోవలసి వచ్చినది. రాజపోషణ గాలిపోయినదిగదాయని వైరాగ్య మొందక, సర్వప్రజల స్వయంసేవా సిద్ధాంతముతో సర్వకళలను సంరక్షించుకోవలెను. సర్వజనసమ్మతమైన సమిష్టికృషియే సాధనోపాయము. కావుననే నేడు మన చిత్తూరుజిల్లా కళాపరిషత్తును ప్రారంభించుచున్నాము అని దీర్ఘోపన్యాసము గావించిరి. ఈ పరిషత్తు తరఫున జన్మించిన "మేల్కొలుపు" అను చేతివ్రాతపత్రికకు ప్రారంభోత్సవము జరిపి, అది మాసపత్రికనుండి క్రమమున పక్ష, వార, దిన పత్రికగా ప్రవృద్ధమై ముద్రింపబడుగాక యని యాశీర్వదించిరి.

కడపట ఈపరిషత్తుకు శ్రీ పి. రాజగోపాల్ నాయుడు గారు ప్రధానాధ్యక్షులుగాను, శ్రీ కె. సభాగారు కార్యదర్శిగాను, శ్రీ జి. చెన్నారెడ్డి గారు, శ్రీ వి. నాగయ్యగారు, గౌరవాధ్యక్షులుగాను, ఏకగ్రీవముగా ఎన్నుకొనబడిరి. సారస్వతము, నాటకము, చిత్రలేఖనము అను మూడు శాఖలుగా విభజించి, ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క అధ్యక్షులు, కార్యదర్శులు జిల్లాలోని ఒక్కొక్క తాలూకా కిద్దరుచొప్పున కార్యనిర్వాహక సభ్యులు ఎన్నుకొనబడిరి. మధ్యాహ్నము 3 గం॥లకు ప్రారంభించిన సభ రాత్రి $3\frac{1}{2}$ గంటలకు సమాప్తినొందెను.

బి. పి. రామచంద్రారెడ్డి, (చదుం)
కళాపరిషత్సభ్యుడు.

స మా వే శ ము లు

౧. మల్లవరం :

ది 5-5-53 తేది మంగళవారము రాత్రి 8 గం లకు మా గ్రామపాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశము జరిగినది. పురజనులు, గ్రామాధికారులు, లేబరుర్లు బాలబాలికలు తదితర పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెక్కుమంది సభకు వచ్చిరి. పతాకవందన గీతముతో సభ ప్రారంభమయ్యెను. శ్రీ బి. కృష్ణమూర్తిగారు సభకు అధ్యక్షత వహించిరి. సభయొక్క యుద్దేశమును గురించియు, పాఠశాలాభివృద్ధిని గురించియు, ఉపాధ్యాయులు ఉపన్యసించిరి: హెడ్మాష్టరు శ్రీ పి. కుమారరత్నముగారు రచించిన "తల్లి నేర్పు" అను నాటికను బాలబాలికలు ప్రదర్శించిరి. గ్రామస్థులు బాలబాలికలను రూ5-0-0 విలువగల బహుమానములను పంచిపెట్టిరి. అధ్యక్షులు వయోజనవిద్యను గురించియు, పిల్లలను చదివించుటలో తల్లిదండ్రులకు గల బాధ్యతలను గురించియు, ఉపన్యసించిరి. ప్రధానోపాధ్యాయుని వందన సమర్పణతోను జాతీయ గీతముతోను సమావేశము ముగిసెను.

—పి. కుమారరత్నము–హెడ్మాష్టరు.

౨. S. రాయవరం ;

ఈ గ్రామ ప్రాథమికపాఠశాలయందు ది 7-5-53 తేది శుక్రవారము మధ్యాహ్నము 3 గంటలకు నిర్బంధ విద్యాకమిటి ఎలమంచిలిరేంజి డిప్యూటీ యినస్పెక్టరు శ్రీ బి. నరసింహారావుగారి అధ్యక్షతక్రింద సమావేశమయ్యెను. ఈ సంవత్సరము జూన్ నెల నుండి అములులోనికివచ్చు నూతన విద్యావిధానము, దాని

జూన్]

ప్రాముఖ్యము. దానియెడల ప్రజలు చూపవలసిన ఆదరాభిమానములు మున్నగు వాటినిగురిం చక్కగా తెలియజెప్పిరి. సదరు కమిటీమెంబర్లు ఈ విద్యావిధానము అవిచ్ఛిన్నముగా దినదిన ప్రవర్ధమగునట్లు తోడ్పడుటకు హామీయిచ్చిరి. హాజరును వృద్ధిచేయుట, క్రొత్తపిల్లలను చేర్చుట మొదలగు విషయములను గురించి కార్యదర్శి చర్చించిన పిమ్మట సమావేశము జయప్రదముగా ముగిసెను.

—పి. వెం. గం. సత్యనారాయణ-కార్యదర్శి.

వార్షికోత్సవములు

౧. మోర్త :

తణుకు ఈష్టురేంజి డిప్యూటి ఇనస్పెక్టరు ఆఫ్ స్కూల్సు శ్రీ పోతుగంటి వెంకటరమణరావుగారి అధ్యక్షతక్రింద మోర్త హయ్యర్ ఎలిమెంటరీ గర్లస్కూలు వార్షికోత్సవము 1-5-53 తేదీన మహావైభవంగా జరిగింది. సదరుపాఠశాల మేనేజరు శ్రీ కంటిపూడి బాపన్నగారి చిత్రపటాన్ని అధ్యక్షులవారు ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఆస్కూలు టీచర్సు అసోసియేషన్ వార్షికోత్సవముకూడా తణుకు వెష్టురేంజి సీనియరు డిప్యూటీ ఇనస్పెక్టర్ శ్రీ కె. వెంకటేశ్వర్లుగారి అధ్యక్షతక్రింద జయప్రదంగా జరిగింది. శ్రీ గుంటూరి వెంకటశాస్త్రి కవిగారు స్వాగతపద్యాలు చదివారు శ్రీ కంటిపూడి బాపన్న సోదరిగారిని ప్రశంసిస్తూ శ్రీ సామర్తి వెంకటరమణరావుగారు ఆశీస్సులు పలికారు. ఘంటసాలవారి శిష్యులు శ్రీ వల్లూరి గోపాలరావుగారి ఘటవాద్యముతో మేళవించి పాఠశాలోపాధ్యాయులు శ్రీ వెంపటి వెంకటసూర్యనారాయణగారు సంగీత కాలక్షేపం జరిపారు. అధ్యక్షులైన పరిశీలకులిద్దరు నూతన విద్యావిధానంతో కూడిన ప్రణాళికలనుగూర్చి, ప్రభుత్వం ఉత్తర్వులనుగూర్చి విశదీకరించి గ్రామస్థుల సహకారాన్ని అర్థించారు. శ్రీ నూతి సుబ్బారావుగారు, శ్రీ భమిడిపాటి సూర్యనారాయణగారు సభకు విచ్చేసి అమూల్య సందేశాన్నిఅందజేశారు. రాత్రి స్కూలు టీచర్సు అసోసియేషన్‌వారు తారాశశాంక నాటకాన్ని ప్రదర్శించారు. ప్రధానాచార్యులవారి వందనాలతో సభ జయప్రదంగా ముగిసింది.

—కె. యల్. నరసింహం-హెడ్మాష్టరు

౨. ఏలూరు :

ది 8-5-1953 తేదీ సాయంత్రం 4 గం. లకు ఏలూరు-గాంధీనగరం-మునిసిపల్ హయ్యరుఎలిమెంటరీ స్కూలు వార్షికోత్సవము వైస్‌ఛైర్మన్ శ్రీ రాజనాల గోపాలరావునాయుడుగారి అధ్యక్షతక్రింద జరుపబడెను. మహాజన సభకు శ్రీ ఈదర వెంకట్రావు పంతులుగారు, కొందరు కౌన్సిలర్లు, పెక్కుమంది పురప్రముఖులువచ్చిరి. కార్యక్రమ ప్రకారం పిల్లల ప్రదర్శనములు, ఆటపాటలు బుర్రకథలు మున్నగునవి జరిగెను. పిల్లలకు బహుమతులు దుస్తులు పంచిపెట్టబడెను. పెద్దల ఉపన్యాసములతోను హితోక్తులతోను వార్షికోత్సవము జయప్రదముగా ముగింపబడెను. —దామరాజు శివరామయ్య-టీచరు.

3. నల్లచెరువు :

ది 9-5-1953 తేదీ శనివారమునాడు శ్రీ మోటూరి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షతక్రింద హిందూఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల ప్రథమ వార్షికోత్సవము జరిగెను. ఉదయము పతాకవందనము జరిగిన తరువాత బహిరంగసమావేశముజరిగెను. ఆసమావేశమునందు తల్లిదండ్రుల సహకారమునుగురించియు, విద్యావశ్యకతను గురించి గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఉపన్యసించిరి. బాలబాలికలచే నృత్యగాన వినోదములు ప్రదర్శింపబడెను. వస్తుప్రదర్శనము జరిగెను. అధ్యక్షుని తుదిపలుకుతోను, జాతీయగీతముతోను సభ జయప్రదముగా ముగిసెను.

—చింతపెంట శరభరాజు-హెడ్మాష్టరు

౪. నిడమర్రు :

ది 9-5-53 తేదీ శనివారము సాయంకాలము 5 గం. నుండి తాడేపల్లిగూడెము తాలూకా నిడమర్రు బోర్డుప్రాథమికోన్నత పాఠశాల 58 వ వార్షికోత్సవము నిడమర్తి సత్యనారాయణగారి అధ్యక్షతక్రింద

...మత్సమున, విద్యార్థులయొక్క వివిధవిచిత్ర విజ్ఞానవిషయిక ప్రదర్శనములతోను ...ను జయప్రదముగా జరిగెను. బాలబాలికలకు బహుమతులు మిఠాయీలు పంచిపెట్టబడిన ప్రధానోపాధ్యాయులు శ్రీ కణితి సన్యాసిగారి వందనములతో సభముగిసెను.

—కణితి సన్యాసి- హెడ్మాష్టరు

౫. దంగేరు :

ది 1-5-53 తేదీ శుక్రవారం సాయంకాలము దంగేరు కేంద్రోపాధ్యాయ సంఘ వార్షికోత్సవము శ్రీ పోలిశెట్టి వెంకటస్వామిగారి అధ్యక్షతక్రింద జరుపబడెను. షుమారు 100 ఉపాధ్యాయులు 20(పైగా పెద్దలు సభకు విచ్చేసిరి. విద్వాన్ శ్రీ ఎ. ధర్మదాసు (S.D.I.) గారు రాబోవు నూతన విద్యా విధానమును గురించి చక్కగా విశదీకరించిరి. విద్యార్థులు నందనార్ నాటకమును ప్రదర్శించిరి. జాతీయ గీతముతోను కార్యదర్శి వందన సమర్పణతోను సభ జయప్రదముగా ముగిసెను.

—యన్. సూర్యారావు-కార్యదర్శి.

జమ్మవరం కేంద్రప్రాథమికోపాధ్యాయ ప్రథమ వార్షికోత్సవము

నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా జమ్మవరం కేంద్రప్రాథమికోపాధ్యాయ వార్షికోత్సవం, తే 1-5-1953 దిన కావలియడవల్లి గ్రామములో అత్యంతవైభవముగా జరిగినది. సభకు ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ పత్రికాసహాయ సంపాదకులగు శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు అధ్యక్షత వహించిరి. మద్రాసు శాసనసభ్యులు నెల్లూరు జిల్లాబోర్డు అధ్యక్షులైన శ్రీ నలబోతుల చెంచు రామానాయుడుగారు సభను ప్రారంభించిరి. స్థానిక శాసనసభ్యులు శ్రీ జి. సి. కొండయ్యగారు, ఆత్మకూరు రేంజిస్కూళ్ల డిప్యూటి ఇన్స్పెక్టరు శ్రీ. పి. వెంకటేశ్వర్లుగార్లు, ఉపన్యసించిరి. సభకు పురప్రముఖులు అనేకమంది విచ్చేసిరి. విద్యావిషయక వస్తుప్రదర్శనముగూడ ఏర్పాటుచేయబడెను. సంఘనివేదికను సంఘ కార్యదర్శిగారగు శ్రీ పి. బాపువగారు సమర్పించుకొనిరి.

సభను ప్రారంభిస్తూ శ్రీ నలబోతుల చెంచురామానాయుడుగారు ప్రభుత్వము యొక్క మేనేజిమెంట్లయొక్క ఆర్థికపరిస్థితిని వివరిస్తూ వేతనాభివృద్ధికొఱకై ఆందోళనజేసిన ప్రయోజనముండదని, విద్యా విధానములో మార్పులు తీసికొని వచ్చుటకు, ఉపాధ్యాయులకు తగుసదుపాయములు కల్పించుటకు, ప్రభుత్వమునకు కాలవ్యవధి యివ్వవలసిన కారణమును ప్రస్తావిస్తూ ఉపాధ్యాయులు తమజీతములమీద, ఆధారపడక గ్రామస్థుల సహాకారమును బొందుటకు కృషిసల్పవలసి యుంటుందని శెలవిచ్చిరి. శ్రీ డిప్యూటి ఇన్స్పెక్టరువారు ప్రాథమిక పాఠశాలల దుస్థితిని వివరిస్తూ యిందులో మేనేజిమెంట్లుకు కూడ కొంత భాగముందని తెల్పిరి. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి తీవ్రకృషిసల్పాలని, కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు కేవలం వ్యాపారసంస్థలుగా పనిచేయుటం జరుగుతుందని, విద్యాశాఖక్రింద ఖర్చుపెట్టబడు ద్రవ్యం సద్వినియోగం కావడంలేదని, నుడివిరి. తదనంతరం శ్రీ జి. సి. కొండయ్యగారు, అనర్గళముగా ఉపన్యసించిరి. ఈనాడు మనదేశములో ప్రజలకుపకరించని బానిసవిద్యా విధానము అమలులోనున్నదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారములోనికి వచ్చి 6 సం॥లు పూర్తియగుచున్నను విద్యావిధానములో మార్పుతేబడలేదని అయిన అర్థరహితమైన ఆ విద్యకు దారితీసే కొన్నిమార్పులను తీసికొనివచ్చి పరిస్థితులను విషమింపజేస్తూ యున్నారని, డబ్బులేదను సాకుతో ఉపాధ్యాయుల వేతనాలుకూడ ప్రభుత్వము పెంచ నిరాకరిస్తుందని యిది అత్యంత శోచనీయమైన విషయమని, నుడివిరి. దేశములోయుండే విషమపరిస్థితులు చక్కబడిననాడే ఉపాధ్యాయుల కోర్కెలు ఫలించగలవని కాబట్టి ఉపాధ్యాయులు, రైతులు, కూలీలు, తదితరసంఘాలతోటి చేతులుకలిపి దేశసౌభాగ్యమును తీర్చిదిద్దుటలో తమకర్తవ్యాన్ని నిర్వహించాలని, ఉద్బోధించిరి. నవచీనాలో మనకంటె వెనుకనే స్వాతంత్ర్యమువచ్చినను. విద్యాభివృద్ధికొఱకు ఎనలేనికృషిసల్పుచున్నదని కాని మనప్రభుత్వం 6 సం॥లైనప్పటికి యేమిచేయలేకపోయిందని, విమర్శించిరి. ఈ దుస్థితితొలగాలంటే ప్రభుత్వవిధానం మారాలని, అట్టిమార్పులను తీసికొని వచ్చుటకు ఉపాధ్యాయులు తమపాలికృషిచేయాలని, వ్యక్తపర్చిరి. అనాసముద్రము లేబరుపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ బి. వెంకటసుబ్బయ్యగారు ఉపాధ్యాయుల పక్షములో మాట్లాడిరి.

ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య

తరువాత అధ్యక్షులు తమ అంత్యోపన్యాసములో శ్రీ జి. సి. కొండ తాము పూర్తిగా ఏకీభవిస్తున్నానని. ఉపాధ్యాయుల సంఘాలు కేవలము జీతముల[కే] కాకుండా బాధ్యతలనుగూడ గుర్తింపజేస్తుందని. ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ టీచర్సు ఫెడరేషను అనుసరిస్తున్న విధానమే యిందుకు తార్కాణమని, విశదీకరించిరి. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యాధికారులు, విద్యార్థులు సమైక్యంగా కృషిసల్పుట అవసరమనిరి. డబ్బుతో సంబంధములేని విషయములు కూడా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చి, సహకరించడములేదని. ప్రభుత్వము సాగిస్తున్న పాలసీతో ఉపాధ్యాయుల కెంతమాత్రము విశ్వాసము లేదని, అందువల్ల ఉపాధ్యాయులు తమసంఘటితశక్తివల్ల సమస్యలను పరిష్కరించుకోవలెనని, ఉద్బోధించిరి. సభజరిపినట్టి ఉపాధ్యాయులకు, సభకువిచ్చేసిన తదితరులకు కొవలి యడవల్లి పంచాయితీ బోర్డుప్రసిడెంటుగారగు శ్రీ అయితా సుబ్బానాయుడుగారు యితరగ్రామ పెద్దలు ఉచితభోజన సౌకర్యములను కల్గజేసిరి. కార్యదర్శిగారి వందనసమర్పణతో జాతీయగీతానంతరం సభముగిసెను.

ఇట్లు
పి. జాషువ, కార్యదర్శి.

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ మహాసభలు

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ మహాసభలు ది 26-4-53 న శ్రీ నడింపల్లి వెంకటలక్ష్మీనరసింహారావు పంతులు, బార్ - ఎట్ - లా M. L. A. గారి అధ్యక్షతను గుంటూరు హిందూ కాలేజీలో జరిగినవి. శ్రీ నన్నపనేని వెంకట్రావుగారు, తెనాలి మునిసిపల్ ఛైర్మన్, జాతీయపతాకము ఎగురవేసిరి. వీరు వివిధ మేనేజిమెంట్లక్రింద ప్రాథమిక విద్యావ్యాప్తి యేవిధముగా కుంటుపడుచున్నదో సవిస్తారముగా తెలియజేశారు. పాఠశాలలన్నీ ఒకేఒక్కటైన మేనేజిమెంటు క్రిందకు తేవాలని ప్రభుత్వానికి సూచించారు. ఎయిడెడ్ స్కూళ్ళలో మేనేజర్లకు నచ్చినంతవారు అవసరమగు పూర్తిగ్రాంటును యివ్వకుండుటచే టీచర్లు తమకు న్యాయముగా వచ్చు గ్రాంటుకొన్నైనా యేవిధముగా అనుభవించలేకపోవుచున్నారో వివరించారు.

సభాధ్యక్షులు శ్రీ నడింపల్లి వెంకటలక్ష్మీ నరసింహారావు M. L. A. గారు ప్రాథమికోపాధ్యాయులు తమ కోర్కెలను ప్రభుత్వంవారు గుర్తించేటట్లు చేయాలంటే, యు. పి. ఉపాధ్యాయులు మాదిరిగా ధైర్యసాహసములతో త్యాగాన్ని చేయుటకు సంసిద్ధముగా నుండాలని హెచ్చరించారు.

శ్రీ కొత్తపల్లి సీతారామయ్యగారు మాటలాడుచు చిరకాలమునుండి ఉపాధ్యాయులకు సేవ చేయుచున్న మేనేజిమెంటువారి సంఘాలను అన్ని తాలూకాలలోను, అన్ని జిల్లాలలోను, బలపరచుకొను రాష్ట్రప్రాథమికోపాధ్యాయ సమితిలో ఆ సంఘాలను అఫిలియేట్ చేయవలయుననియు, పై సంఘాలకు పోటీగా కలహారంగంప సంఘాలను, వాటి కార్యకర్తల మాటలను, లెక్కచేయవలదనియు, నేడు ప్రాథమిక పాఠశాలలు వివిధ మేనేజిమెంట్లక్రింద నడుపబడుచుండుటచే ఉపాధ్యాయులు ఉద్యోగాలలో స్థిరత్వములేక యమయాతనలు పడుచున్నారనియు, సంఘములను గట్టిపరచుకొన్న ఉపాధ్యాయులు గట్టెక్కగలరనియు చెప్పిరి.

ఈ దిగువ తీర్మానములు గావించినపిదప శ్రీ. జి, యస్, శర్మగారివందన సమర్పణంతో సభ ముగిసెను. ఈ మహాసభలు దిగ్విజయముగా కొనసాగించుటకై అర్థనూటపదహార్లు విరాళ మొసగిన వెంకట్రామ కంపెనీ ప్రొప్రయిటరు ఈదర వెంకట్రావుపంతులుగారికి ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికై భగవానుని ప్రార్థించడమైనది.

తీర్మానములు:—

(1) ఆంధ్రరాష్ట్రమునందలి ప్రాథమికోపాధ్యాయుల మేనేజిమెంటువారి సంఘాల పునాదులపై ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ సమితిని ఏర్పాటు చేయుచు తీర్మానించిరి,

(2) సంఘనిబంధనలు ఆమోదించడమైనది.

(3) పైసమితికి ఈ క్రింది అధికారివర్గమును ఎన్నుకొనిరి.

(1) అధ్యక్షుడు:— శ్రీ కొత్తపల్లి సీతారామయ్య

(2) జనరల్ సెక్రటరి:— శ్రీ దేశిరాజు సుబ్బారావు

సభలు - తీర్మానములు

...లు:— 1. బి. కె. విశ్వేశ్వరరావు 2. యన్ ఆబెద్నగొ 3. శ్రీ సి.వి. రంగయ్య

...కార్యదర్శులు:— 1. యస్. పరమేశ్వరశర్మ, 2. ఎ. యల్. నరసింహారావు. 3. యన్. వరదయ్య.

(?) కోశాధికారి:— కె. వి. శ్రీనివాసరావు.

మహాసభల తీర్మానములు.

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ మహాసభలు ది26-4-53 న గుంటూరు హిందూకాలేజిహాలులో శ్రీ నడింపల్లి వెంకటలక్ష్మి నరసింహారావు పంతులు, బార్-ఎట్-లా ఎం. ఎల్. ఎ గారి అధ్యక్షతన సమావేశమై ఈ దిగువ తీర్మానములను ఆమోదించెను.

తీర్మానములు :—

(1) ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకై ఆత్మబలిదాన మొనర్చిన శ్రీపొట్టి శ్రీరాములుగారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థింపుచూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సందర్భమున శ్రీపొట్టి శ్రీరాములుగారి ఆశయాలను తు. చ. తప్పకుండా ప్రవర్తించవలెనని ఆంధ్రనాయకులను ఈసభవారు కోరుచున్నారు.

(2) యు. పి. రాష్ట్రములోని యుపాధ్యాయులు తమ న్యాయమైన కోర్కెలను సాధించుటకై పోనర్చుచున్న వీరోచిత పోరాటమును యీసభవారు అభినందించుచూ టీచర్ల న్యాయమైన కోర్కెలను అన్నిరాష్ట్రములలోను తీర్చుటకై కేంద్రప్రభుత్వము వెంటనే తగుచర్యలను తీసికోవలసినదని కోరుచూ తీర్మానించడమైనది.

(3) సెంట్రల్ పే కమీషన్ నిర్ణయించిన జీతముల స్కేళ్ళను వివిధ మేనేజిమెంట్లలోని టీచర్లకు వెంటనే యిప్పించ గలందులకు ప్రభుత్వమువారిని కోరడమైనది.

(4) జిల్లాబోర్డుల టీచర్ల జీతాలు ప్రతినెల మొదటివారములో చెల్లించులాగున చేయుటకై గవర్నమెంటువారు సకాలములో క్రెడిటు అడ్జర్నమెంటు చేయించవలసినదిగా కోరుచూ తీర్మానించడమైనది.

(5) లోకల్ బోర్డు, మునిసిపల్ టీచర్లకందరకూ సిక్‌లీవు నిండుజీతముపై మంజూరు చేయులాగున శలవుచట్టమును సవరించవలసినదని ప్రభుత్వమువారిని కోరడమైనది.

(6) బోర్డు, మునిసిపల్ టీచర్ల ఉద్యోగవయఃపరిమితి, 60 సంవత్సరములకు పెంచవలసినదిగా ప్రభుత్వమువారిని కోరడమైనది.

(7) బడిదినములసంఖ్య 220 నుండి 200 వరకు తగ్గించవలసినదిగా ప్రభుత్వమువారిని కోరడమైనది.

(8) ఎలిమెంటరీస్కూలులలో పనిచేయు శెకండరీగ్రేడు టీచర్లకు హైస్కూలులలోని శెకండరీగ్రేడు టీచర్ల జీతములస్కేళ్లను యిప్పించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడమైనది.

(9) ప్రాథమికోపాధ్యాయులకుగూడ యుపాధ్యాయ ప్రతినిధుల ఎన్నికొరకు ఓటింగుహక్కును కలిగించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడమైనది.

(10) ప్రాథమిక పాఠశాలలయందు 5 తరగతుల కోర్సు పూర్తిచేసి కృతార్థులైన విద్యార్థులను ప్రవేశ పరీక్షలతో నిమిత్తము లేకుండా రికార్డుషీటు ఆధారముపైననే హైస్కూళ్లలో 1 వ ఫారములో చేర్చుకొనుటకు హెడ్మాష్టర్లకు హక్కునీయవలసినదిగా ప్రభుత్వమును కోరడమైనది.

(11) పెద్దటవున్లలోని ప్రాథమికోపాధ్యాయులకు సిటీఎలవెన్సు శాంక్షన్ చేయువలసినదని ప్రభుత్వమును కోరడమైనది.

(12) టీచర్లందరకు సంవత్సరానికి 20 రోజులు క్యాజుయల్ లీవు మంజూరు చేయవలసినదని ప్రభుత్వాన్ని కోరడమైనది.

(13) ఉపాధ్యాయుల బిడ్డలకు ఉచిత విద్యా సౌకర్యాలను హైస్కూళ్లలోని హైయ్యర్ ఫారములలోను, కాలేజీలలోనుకూడ యిప్పించవలసినదని ప్రభుత్వాన్ని కోరడమైనది.

(14) ఎయిడెడ్ ఎలిమెంటరీస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకుకూడా డ్యూటీఎలవెన్సులను మంజూరు చేయుచూ వాటికై ప్రత్యేక గ్రాంటులను నీయవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడమైనది.

(15) ఎయిడెడ్ స్కూళ్ళ మేనేజర్లకిచ్చు మెయింటినెన్సుగ్రాంటు [illegible] ములకు వదలివేయబడి యుండుటవలననూ, అయ్యది పాఠశా[illegible] నందుననూ, కొన్ని సందర్భములలో ఆలోటులను, ఆపాఠశా[illegible] వలసి వచ్చుచుండుటచే ఆటీచర్లకు స్వల్పమైన తమగ్రాంట్లు [illegible] లేక పోవుచున్నది. గాన ప్రభుత్వము వారు యీ ఘోరమైన [illegible] జర్లకగు బడిఖర్చుల మొత్తములను ఎట్టిబేరములు లేకుండా [illegible] వారి గ్రాంటుస్కేళ్ళనైనా ఆయాసందర్భములలో అనుభవించుటకు [illegible] వలసినదని ప్రభుత్వము వారిని కోరడమైనది.

(16) ప్రతిఎయిడెడ్ ఎలిమెంటరీస్కూలులోను, మునిసిపల్ స్కూ[illegible] పిల్లలను స్కూలుకు హాజరుపరుచుటకు ఒక కండక్టరును నియమి[illegible] వలసినదిగా ప్రభుత్వమును కోరడమైనది.

(17) పట్టణములందలి ఎయిడెడ్ ఎలిమెంటరీస్కూలు టీచర్లకు ము[illegible] ఎలవెన్సులను యివ్వవలసినదని ప్రభుత్వాన్ని కోరడమైన[illegible].

(18) హైయ్యరు ఎలిమెంటరీస్కూళ్ళలో పనిచేయు బి. ఎ. బి. [illegible] స్కూళ్ళలో హెడ్మాష్టర్లకిచ్చు స్కేళ్ళను మంజూరు చేయవ[illegible] కోరడమైనది.

(19) ఎయిడెడు ఎలిమెంటరీ స్కూళ్ళకు టీచింగుగ్రాంటు పంపున[illegible] ఖర్చులను, రిజిష్ట్రేషన్ ఖర్చులను, సదరుబిల్లును మార్చుకొనుటకగు [illegible] ప్రభుత్వము వారే భరించవలసినదని కోరుచున్నాము.

(20) ఎయిడెడు ఎలిమెంటరీస్కూలు టీచర్లపై విధింపబడు జరిమా[illegible] ఉపాధ్యాయగౌరవమును నిలువబెట్టవలసినదిగా కోరుచున్నాము.

(21) ఎలిమెంటరీ స్కూళ్ళలోని పిల్లలు చాలమంది బడిని వదలిపో[illegible] లోపమని నిర్ణయించడం చాల అక్రమమనియూ, బడిపిల్లలు [illegible] చుండుచున్నారనియూ, యీ విషయములో యుపాధ్యాయులకు [illegible] పరీక్షాధికారులు శ్రద్ధ వహించవలెననియూ, కోరుచున్నాము.

(22) ప్రస్తుతము ప్రాథమిక పాఠశాలలకు ఒక నిర్ణీతమైన (School [illegible]) [illegible] ప్రాంతములోని పాఠశాలలకు అభివృద్ధి నిరోధకమైన పో[illegible] వ్యాప్తి తింటుబడుచూ, ప్రభుత్వద్రవ్యము కొంతవరకు [illegible] గాన ప్రతి పాఠశాలకు ఒకనిర్ణీతమైన ప్రత్యేక ఎడ్యుకేషనల్ వార్డును ఏర్పా[illegible] రికగ్నైజుడు పాఠశాలను వుండకుండునట్లు ప్రభుత్వము వారు [illegible] పాఠశాలలకు స్థిరత్వము, గౌరవ ప్రతిపత్తులు, ఉండునట్లు చేయవలసినదిగా కోరుచున్నాము.

(23) టీచర్సు ట్రైనింగు పొందక పదిసంవత్సరములకు పైగా ప్రాథమిక పాఠశాలలలో టీచర్లుగా పనిచేయుచూ అనుభవము గణించిన టీచర్లను ఏకారణములచే నైనా ట్రయినింగు తీసుకొను అవకాశము లేనట్టియూ, నలుబది సంవత్సరాలు పైబడినట్టి వారికైనా [illegible] ఇప్పించవలసినదని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

(24) ట్రయినింగు పరీక్షలో తప్పిన టీచర్లు టీచర్లప్రపోర్షనులో [illegible] చున్నారు. గాన అట్టిటీచర్లకు ఎగ్జమ్షన్లతో నిమిత్తము లేకుండా [illegible] కల్పించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

గుంటూరు,
26-4-1958

(సం) నడింపల్లి [illegible]

వివరములకు:—

[illegible]
కొత్తపల్లి [illegible]
R. [illegible]
195[illegible]

Edited by Sri M. Venkata Ratnam Garu, B. A., & Printed and Published by Sri E. Venkaiah Garu at his Pattabhirama Press, Eluru.